ఆగస్టు - 2019

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| తిమోతి | కొడవటికంటి | 03 |
| శాశ్వత రక్షణ | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 05 |
| క్రైస్తవజీవిత దృక్కోణం | పి.రంజిత్ కుమార్ | 07 |
| గుణవతి | రేచెల్ జోసఫ్ | 09 |
| మదర్ తెరీసా | బ్రదర్ కె. సామ్రాట్ | 10 |
| తండ్రి-బాధ్యత | మంజుల చంద్ర | 12 |
| సునామీ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 14 |
| సాక్ష్యము | శ్రీమతి శీలారామ్ | 15 |
| దేవుడు-సిరి | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 17 |
| బైబిలు కథలు- ఏలీయా | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 18 |
| క్రొత్త కోణాలు | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 20 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | 24 |



**ప్రధాన సంపాదకులు :**

**రెవ.డా॥ కె. జోసఫ్**

**సర్క్యులేషన్ :**

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. **250/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-

**చిరునామా :**

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28, క్లౌపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9704255416

**బ్యాంక్ అకౌంట్ వివరాలు :**

A/c Name: **K. Joseph**

A/c No.: **10957380353**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890



INDIA EVANGELISTIC & RELIEF FELLOWSHIP

EVANGELISM
- Church Planting
- Evangelistic Crusades
- Pastor's Seminars
- Youth Ministry
- T.V.Ministry
- Magazine Ministry
- Audio Ministry
- Jail & Prison Ministry
- IERF International Ministry
- Hanna Women Ministries

RELIEF
- Orphanage
- Child Development Centers
- Education (U.C.L.I. Schools)
- Widows & Lepers Care
- Medical Assistance
- Help in Natural Calamity
- Flood Relief
- Mobile Medical Ministry
- Children Care Ministry

# సంపాదకీయం.....



ప్రియ పరిశుద్ధత పాఠకులకు ప్రభువు నామమున శుభాభివందనములు.

'పరిశుద్ధత' మాస పత్రికను ఆదరిస్తున్న మీ అందరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అనేకమంది చందా కట్టటం లేదు. మేము పత్రిక పంపించే వారిలో నూటికి నలుగురు మాత్రమే చందా కట్టిన వాళ్ళు. కొన్ని వందల మంది పత్రికను ఉచితంగానే పొందుతున్నారు. దేవున్ని అభిమానించే వారు బొత్తిగా కరువైపోతున్నారు. నేను ఈ మధ్య గమనించింది ఏంటంటే, మనుష్యులను అభిమానించి వారి కోసం డబ్బు ధారాళంగా ఖర్చు పెట్టే వాళ్లు కోకొల్లలుగా ఉన్నారు. సినిమా యాక్టర్స్, రాజకీయ నాయకుల కోసం తమ కష్టార్జితాన్ని ఎంతో ఉత్సాహంగా ఖర్చు చేసి తమ అభిమానాన్ని చాటుకునే వాళ్ళు మన చుట్టుప్రక్కల చాలామంది ఉన్నారు. వాళ్ళ సొమ్మంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. ఎందుకంటే, వీళ్ళు ఎవరో తెలియని వారికోసం, వారి వల్ల వీరికి ఎలాంటి ప్రతిఫలం రాదని తెలిసినా కూడా వందల రూపాయలు ఖర్చు చేసి ఫ్లెక్సీలనీ, కరపత్రాలనీ, ఇంకా ఇతరత్రా అవసరాలకి తమ కష్టార్జితాన్ని ఇవ్వడం అవివేకమే. దేవుడు ఆరోగ్యమిస్తేనే కష్టపడి పనిచేసి డబ్బు సంపాదించ గలుగుతున్నారు. అలాంటిది, దేవుని కార్యాలకు కాకుండా ఈ లోకానుసారమైన కార్యక్రమాలకు ఖర్చు చేస్తూ దేవుడు తమకు ఇచ్చిన ఆరోగ్యాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. అయినప్పటికీ కృప గలిగిన దేవుడు అలాంటి వారికి ఇంకా సమయమిస్తున్నాడు వాళ్ళు దేవున్ని గుర్తించాలని.

గత కొంత కాలంగా పత్రిక చందా విషయమై అనేకమైన విజ్ఞప్తులు చేస్తూ వున్నాము. అయినా ఎవరూ స్పందించటం లేదు. దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినగా కోరుచున్నాను. మీరు నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేయదలచి నట్లయితే మా అకౌంట్ నంబర్‌కి ట్రాన్స్‌ఫర్ చెయ్యండి. K. Joseph, A/c No. 10957380353, SBI Main Branch, Ongole, IFSC Code SBIN0000890. మీరు ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేసినా, మనియార్డరు చేసినా దయచేసి మాకు 9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. ఒకవేళ మీరు చందా కట్టినప్పటికీ మీ పేరు చందాదారుల లిస్టులో లేనట్లయితే వెంటనే మాకు తెలియజేయండి. బైబిల్ క్విజ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని బైబిల్‌జ్ఞానం సంపాదించుకోవాలని కోరుతున్నాను. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

-ఎడిటర్

**K. Joseph, SBI Main Branch, Ongole**
**A/c No. 10957380353**

| సీరియల్ నంబరు | |
|---|---|

సీరియల్

# తిమోతి

17

**(అపొస్తలుడు మూడవభాగం)**

**- కొడవటికంటి**

ఈకొనియా చేరిందాకా మనసుకింకా సంతోషంగా లేదు. ఈకొనియాలో తక్లా యింటికి వచ్చినప్పుడు అక్కడి విశ్వాసులను ముఖ్యంగా తక్లాను చూసినప్పటి నుండి మరల ఈ జీవితానికి అలవాటై అంకితమైనట్లు అనిపించింది. ఇంత చిన్న వయస్సులో ప్రభువునకు సమస్తము సమర్పించి లెక్కలేనన్ని హింసలు పొంది నిలిచిన తక్లాను చూస్తుంటే తాను తన సమర్పణ సేవ చాలా బలహీనమైనవిగా తోచింది. ఆమె సేవ ద్వారా ప్రభువులోనికి నడిపించబడిన జనసమూహాన్ని చూస్తుంటే ఆమె దేవదూతలా కనిపించింది. కొలస్సై పట్టణం దాటితే వందమైళ్ళ తర్వాత ఎఫెసు వస్తుంది. భూమిలోపల ప్రవహించే వికస్ నదిని గూర్చి విన్నాడు. ఇప్పుడు చూడబోతున్నందుకు తిమోతికి చాలా సంతోషంగా ఉంది. తను ఈ ప్రాంతంలో ఇంతకు ముందు ప్రయాణం చెయ్యలేదు. వికస్ నది ఎక్కడ కనబడుతుందోనని గుఱ్ఱపుబగ్గీ కిటికీలో నుండి చూడటం కష్టంగా ఉంది. పట్టణంలో బండి ఆగినప్పుడు బండి చోదకుని ఆ విషయం అడిగి బండిలో ముందు అతని ప్రక్కన కూర్చోటానికి అనుమతి అడిగాడు. అందుకతను ఒప్పుకున్నాడు. రెండుగంటల ప్రయాణం తర్వాత మియండర్ నది గట్టున ప్రయాణం సాగింది. ఇటుగా చూశాడు వికస్ కనబడుతుంది. కుడి ప్రక్కగా చూస్తే మియండర్ నది పాయలాగా ప్రవహిస్తుంది. బండి బాట వెంబడి వస్తుంది. ఒక మైలు ప్రవహించి మియండర్‌లో విలీనమైంది. సృష్టిలోని ఒక అద్భుతమైన సన్నివేశం అనుకున్నాడు. కొలస్సై అంత గొప్ప పట్టణం కాకపోయి నా తార్సు పట్టణంలాగా వీధులు శుభ్రంగా ఉన్నాయి. పట్టణం దక్షిణంలో చివరన మియండర్ నది ఒడ్డున ఉన్న ఓ పెద్ద భవంతి ముందు బండి ఆగింది. తిమోతి సామాను తీసుకొని బండి దిగాడు. భవంతిలో నుండి ఇద్దరు బానిసలు వచ్చి పౌలుకి నమస్కరించి సామాను తీసికున్నారు. లోపల ఫిలోమోను, అతని భార్య అప్ఫియ, అర్ఖిప్పు అతని కుమారుడు పౌలుకి ఎదురు వచ్చి ఆదరంగా లోపలికి తీసుకొని వెళ్ళారు. రెండు రోజులు వారి ఇంట్లోనే వాక్యము చెప్పి మరలా ఎఫెసు బయలు దేరారు. ఎఫెసు చేరేటప్పటికి చాలా అలసిపోయారు. పిసిదినియ అంతియొకయ నుండి ఎఫెసునకు రహదారి బాగున్నప్పటికి పర్వతాల ద్వారా ప్రయాణమైనందువల్ల కొంచెం కష్టంగానే ఉంది. ఆ దారిలోని చివరి కొండ 'మాగోస్' శిఖరానికి వచ్చినప్పుడు ఎఫెసు పట్టణమంతా ఒక్కసారిగా దర్శనమిచ్చింది. ఈ కొండ మీద నుండి చూచినప్పుడు ఈ పట్టణ అందమంతా కనబడింది. పట్టణంలోని జనం చీమలవలె తిరగటం తిమోతికి ఆశ్చర్యమేసింది. ఈ ఎఫెసు పట్టణానికి మైలు దూరంలో కనిపిస్తున్న బ్రహ్మాండమైన అర్తిమదేవి విగ్రహం ఇంతదూరం వరకు దర్శనమిస్తుంటే అక్కడ ఖచ్చితంగా ఎప్పుడూ ఏదో ఒక సంబరం జరుగుతూనే ఉంటుంది. ఎప్పుడూ ఏదో ఒక చక్రవర్తి ఆ దేవిని సందర్శించటానికి వస్తూనే ఉంటారు. అప్పుడు పట్టణంలో జరిగే ఆర్భాటం అంతా ఇంతా కాదు. ఈ పర్వత శిఖరం మీద నుండి సూర్యోదయం, సూర్యాస్తమయం చూడవలసిన ప్రకృతి దృశ్యమే.

అకుల ప్రిస్కిల్లా చాలా సంబరపడిపోయారు. వారి హృదయాల్లో యేసుని సేవ ఎంత ప్రాముఖ్యమో, పౌలు నడిపింపు అంత అవసరం. కొరింథులో పడవ తెరచాపల తయారీకి ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. అందు వల్ల ఇక్కడ వారి వ్యాపారం బాగా సాగుతుంది. ఒకరోజు


పూర్తి విశ్రాంతిలో అకుల ప్రిస్కిల్ల ఆనాటి పనంతా ఆపి యెరూషలేము, అంతియొకయు, తార్సు, లుస్త్ర సంగతులు విన్నారు. వారికి తిమోతి అవ్వ లోయి, అమ్మ యునీకే తెలియక పోయినా తిమోతి వలన వారు ఎన్నడును తలంచని బంధువులయ్యారు. వారి సంగతి అడిగి తెలుసుకున్నారు. తరువాత ఎఫెసులో సంగతులు చెప్ప టం ప్రారంభించారు. పౌలు తిమోతి ఎఫెసు నుండి యెరూషలేము వెళ్ళిన తరువాత అపొల్లో అనే ఒక యూదుడు ఎఫెసుకు వచ్చాడని చెప్పారు. "ఆయన పేరు యెరూషలేములో ఎన్నడూ వినలేదే" అన్నాడు పౌలు. "ఆయన యెరూషలేము నుండి కాదు, ఐగుప్తు నుండి వచ్చాడు. ఆయన అలగ్జాంద్రియ పట్టణవాసి" అన్నాడు అకుల. అపొల్లో తల్లి దండ్రులు మొదటినుండి అన్యజను లే కాని అపొల్లో జన్మించిన తర్వాత అయిదు సంవత్స రాలకు యూదా మతం స్వీకరించారు. అందువల్ల పేరు మార్చబడలేదు. ఐగుప్తులో విద్యాభ్యాసం చేసినా మోషే ధర్మశాస్త్రం, కీర్తనలు, పవక్తల గ్రంథమంతయు బాగా పరిశోధించిన పండితుడు. పెంతెకోస్తునందు ఆత్మనొందిన అలగ్జాంద్రియా వాసులైన శిష్యులచే ప్రభువు మార్గమును గ్రహించి, ఆత్మలో తీవ్రత నొంది, యేసును గూర్చిన విషయాలన్నీ ఇతరులకు బోధిస్తున్నాడు. మీరు యెరూష లేము వెళ్ళిన తర్వాత ఇక్కడ సమాజమందిరాలలో యేసుని గూర్చి బోధించుచుండెను. కాని కొందరు అడిగిన ప్రశ్నలకు తగిన సమాధానమియ్యలేకుండెను. అందుకని నేను, ప్రిస్కిల్ల ఇంటికి ఆహ్వానించి మా దగ్గరే కొంతకాలం ఉంచుకొని యేసుని గూర్చిన పూర్తి సువార్త, బాప్తిస్మము, పరిశుద్ధాత్మ అన్నీ చెప్పాము. ఆయన కూడ ఏ మాత్రం గర్వం లేకుండా చిన్న పిల్ల వానివలె అన్నీ విషయాలు నేర్చుకున్నారు" అన్నాడు. "ఇప్పుడు ఆయన ఎక్కడున్నాడు" అని పౌలు అడిగాడు. "ఒక వారం క్రితం కొరింథు పట్టణం వెళ్తానని చెపితే కొంత కాలమైన తన యొద్ద ఉంచుకొనవలసిందని పత్రిక వ్రాసి ఇచ్చినాము" అన్నాడు. పౌలు ఆలోచిస్తున్నాడు. "సున్నతి విషయంలో అతని అభిప్రాయం ఏమిటి?" అన్నాడు తనలో తాను అనుకుంటున్నట్లుగా. "మీకున్న అభిప్రాయమే" అన్నాడు అకుల. పౌలు మెల్లగా గాలి పీల్చుకొన్నట్లుగా అనిపించి ంది. సంఘంలోనికి కొత్త సువార్తికులు ప్రవేశించిన ప్పుడు క్రీస్తునందు వారికున్న నిరీక్షణ ఎరుగనిదే ఆయన నిద్రపోడు అనుకున్నాడు తిమోతి. ప్రిస్కిల్లా రెండు గ్లాసుల పానియం తెచ్చి ఇచ్చింది. పౌలు దగ్గరగా వచ్చి కొరింథు సొస్తెనేసు కొద్దిరోజుల క్రితం ఇక్కడకు వచ్చారు. ఆయన ఇక్కడ ఒకటి రెండు నెలలు ఉంటారని చెప్పారు. ఇక్కడ ఆయనకున్న ఆస్థి విషయంలో కొన్ని చిక్కులు ఏర్పడినవి. పౌలు ముఖం ప్రకాశమానమైనది. "ఇప్పుడు ఎక్కడు న్నాడు. ఆ మిత్రుని చూడాలని నేను చాలా సార్లు ఆశించాను. ప్రభువు పక్షాన మనకొరకు ఆయన కొరింథు లో చాలా శ్రమలు అనుభవించాడు" అన్నాడు. అకుల ఒక బాలుని పిలిచి సొస్తెనేసుని పిలుచుకొని రమ్మని పంపించాడు.

తిమోతి సామాను లోపల దించి వచ్చి విశ్రాంతిగా కూర్చున్నాడు. కడుపులో కొంచెం నొప్పిగా ఉన్నట్లుగా అనిపిస్తుంది. పౌలు ఆ విషయం గమనిస్తూనే ఉన్నాడు. ప్రిస్కిల్లా వైపు తిరిగి "అబ్బాయికి ఇంకొక గ్లాసు ద్రాక్షరసం తెచ్చి ఇవ్వు" అన్నాడు. **(సశేషం)**


**గమనిక**

**GNM మరియు B.Sc. Nursingలలో ఖాళీలు కలవు. మీ పిల్లలను చేర్చాలనుకొనే వారు వెంటనే ఈ క్రింది నంబర్లకు ఫోన్ చేసి మీ సీటు రిజర్వ్ చేసుకోండి**

**9676340371, 9704255416**



# శాశ్వత రక్షణ

రెవ.డా॥ కె.జోసఫ్

క్రొత్త జన్మను గురించిన అవగాహన ధనవంతుడైన, యౌవనస్తునికి కూడా లేదు. 'నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమి చేయవలెను' అని అడిగాడు (మత్త. 19:16-21; మార్కు 10:17-22; లూకా 18:18-20). యూదులందరు కూడా ఎదురు చూస్తున్నది మెస్సియ వచ్చి తన రాజ్యమును స్థాపించునని ఆ రాజ్యంలో ప్రవేశించడానికి తగిన క్రియలు కావాలి. కనుక తాను ఆ రాజ్యములో ప్రవేశించుటకు ఏ 'క్రియలు' చేయవలెనని అడిగాడు. అక్కడ అతని ఉద్దేశము నిత్యజీవములో ప్రవేశించడానికి కాదు. ముందు చెప్పబడినట్లుగా నిత్యజీవమునకు క్రియలు అవసరము లేదు (ఎఫెసి. 2:8,9) అది ఉచితము. ఇతని ఉద్దేశము మెస్సియ రాజ్యములో ప్రవేశించుట అనగా యేసుక్రీస్తు వెయ్యేండ్ల పరిపాలనలో ఇంకా విపులంగా చెప్పాలంటే, 'రాబోవు యుగము'లో ఈ యుగమునే వారు 'నిత్యజీవము' అనుకునేవారు. కనుక ఆ అధికారి అడిగిన ప్రశ్నకు సరైన అనువాదమేమంటే 'రాబోవు యుగమునకు వారసుడనగుటకు నేనేమి చేయవలెను' ఇదే విధమైన ప్రశ్న లూకా 10:25-28లో ధర్మశాస్త్రోపదేశకుడు అడిగాడు.

1. యేసుక్రీస్తు అతనికి చెప్పిన సమాధానం, 'నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము అప్పుడు పరలోకమందు నీకు ధనము కలుగును' అని చెప్పాడు. అంటే ధనము కూర్చబడుతుంది అని అర్థము. కాబట్టి ఇక్కడ స్పష్టంగా పలాన క్రియ చేస్తే దానికి తగిన ఫలము లభిస్తుంది అని ప్రభువు చెప్తున్నాడు. క్రియాఫలము వెయ్యేండ్ల పరిపాలనలోనే వుంటుంది. నిత్యజీవమైతే ఉచితము.

ఇక్కడ మరలా మనమొక సంగతి గుర్తు చేసుకోవాలి. నిత్యజీవమనేది నూతన జన్మతో వచ్చేది అంటే హక్కుగా వచ్చేది. జన్మతో కుటుంబములోని స్థానము హక్కుగా వస్తుంది. కానీ జన్మించిన తర్వాత ఆ హక్కును సంపాదించుకోవడానికి ఏ క్రియ చేయనవసరం లేదు. తండ్రికి విధేయులై తండ్రిని మహిమపరచే ఏ క్రియకైనను తండ్రి తన బిడ్డలకు ప్రతిఫలముగా దయచేయును. అలాగే తిరిగి జన్మించిన వారు ప్రపంచ పునర్జన్మమునందు ఫలము పొందుతారు (మత్త. 19:28-29, లూకా 18:29,30). రాబోవు "యుగము" యొక్క పునర్జన్మమునందు ఇక్కడ ఏక వచనము ఉపయోగించబడియున్నది. కాబట్టి ఇది నిత్యజీవమును గురించి చెప్పిన మాట కాదు. ఎందుకనగా నిత్యజీవము అనునది అనేక యుగములతో కూడినది (ఎఫెసీ. 2:6). రాబోవు యుగములు ఎఫెసీ. 3:21లో తరతరములని 1తిమోతి 1:17లో యుగయుగములని నిత్యజీవమును గురించి చెప్పబడినది. తిరిగి జన్మించుట ద్వారా నిత్యజీవాన్ని ఇప్పుడే ఉచితముగా పొందినట్లు గ్రహించుచున్నాము (యోహాను 3:6; 17:3; రోమా 6:23). అయితే రాబోవు 'యుగ జీవితము' ఫలముగా చూడబడుచున్నది. ఇది క్రీస్తు వెయ్యేండ్ల పరిపాలనలో దొరుకుతుంది.

యెషయా 11:9లో చెప్పబడిన విధముగా సముద్రములు జలములతో నిండియుండును గనుక ఆ యుగమునందలి స్థితిగతులు అద్భుతమైన ఆశీర్వాదముగా వుండును. క్రీస్తుయేసు సహవాసములో ఈ విధమైన మహిమగల పరిపూర్ణ జీవితము క్రియలకు తగిన ఫలముగా ఆ యుగమందు అనగా క్రీస్తు వెయ్యేండ్ల పరిపాలనలో విధేయుడైన విశ్వాసికి లభించును. ఇటువంటి ప్రతిఫల జీవితము ఆయన కొరకు సమస్తమును విడిచి, త్యజించిన వారికి మాత్రమే లభిస్తుంది. పరిశుద్ధ గ్రంథములో ఈ విధమైన ఆశీర్వాదాలను విశ్వాసులు పోగొట్టుకొనకూడదని

అనేకచోట్ల హెచ్చరికలు ఇవ్వబడినవి (1కొరింధి. 6:7-10; గలతీ. 5:19-21; ఎఫెసీ. 5:3; మత్తయి 10:38,39, 16:24-27; మార్కు 8:34-38).

యేసుప్రభువు ఎవరెవరి క్రియలకు తగినట్లుగా వారికి ఫలమునిచ్చుటకు తిరిగి వచ్చినప్పుడు రూపాంతరం పొందిన జీవితంలో శాశ్వత ఆనందం పొందునట్లు ఇహ సంబంధ మైన భోగేచ్ఛల జీవితమును మనం చంపుకొనవలెను. మత్తయి 16:27 'ఫలమును' గూర్చి తెలుపుతుంది. ఇక్కడ శిష్యత్వము విధేయతతో కూడినది. మనం ఇహలోక ఆశలను విసర్జించి దేవునికి విధేయులమైయున్న యెడల రాబోవు యుగమందు దేవునితో (యేసుతో) వెయ్యేండ్ల పరిపాలనలో చెప్పనశక్యమగు ఆనందముననుభవించవచ్చు లేక అవిధేయులమై క్రీస్తులోనికి రూపాంతరం పొందని జీవితములలో లోకమును దానియందలి ఇచ్ఛలను అనుభవించిన యెడల రాబోవు యుగములోని నిత్యానంద సంతోషములను పోగొట్టుకొందుము. రాబోవు యుగము అనగా క్రీస్తు వెయ్యేండ్ల పరిపాలన. అదే పరలోక రాజ్యము. క్రీస్తుకు చేసే మన సేవలలో అనగా రక్షింపబడిన తరువాత మనం జీవించే క్రైస్తవ జీవితములో మనము నమ్మశక్యముగా ఉన్న యెడల, దానికి ప్రతిఫలముగా ఆయన రాజ్యములో ఆయనతో పాలించి ఆనందించు ధన్యతను క్రీస్తు మనకు అనుగ్రహిస్తాడు (మత్తయి 25:14-23; లూకా 19:11-19). మనమాలాగు చేయని యెడల ఈ ప్రతిఫల మును నష్ట పోతాము (మత్తయి 25:24-30). లూకా 19:20-26 యేసుక్రీస్తు రాజ్యమగు వెయ్యేండ్ల పరిపాలనలోనికి ప్రవేశం పోగొట్టుకొనినవారు "వెలుపటి చీకటిలోనికి త్రోసివేయబడ తారు (మత్తయి 25:30). ఇచ్చట ఏడ్పును, పండ్లు కొరుకు టయు వుండును. ఆయన సేవకులకు (విశ్వాసులకు) ఇచ్చే తీర్పులన్నియు వారి వారి సేవా పనుల మీద ఆయన తీర్పు ప్రకారం వెలుపట (ఈ చీకటిలో వేయబడుట, అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును అనే ఈ శిక్ష ఎంత భయంకరంగా వుంటుందో తెలియదు). చీకటిలో వేయబడుట అనేది శిక్ష మాత్రమే కాని నిత్యజీవమును పోగొట్టుకొనుట కాదు. ఉదా: కుమారుడు చేసిన తప్పుకు శిక్షననుభవించునే గాని వారసత్వము పోగొట్టుకొనడు (2సమూ. 7:14,15; కీర్తన 89:30-34). ఈ భాగాలన్నీ కూడా క్రీస్తు న్యాయపీఠం యెదుట అనుకూల ప్రతికూల ఫలములకు సంబంధించి నవి (మత్త. 25:19; లూకా 19:15). హెబ్రీ. 2:5,6లో చెప్పినట్లు రాబోవు యుగము దేవుడు దేవదూతలకు అప్పగిం చలేదు కాని క్రీస్తుతో కలసి ఏలుటకు మానవులకు అప్పగిం చాడు. దేవుడు మానవుని చేయుటలో తన సంకల్పమగు ఆ.కా. 1:25-27లో చెప్పబడిన విధంగా క్రీస్తుతో కూడా ఏలుటకు జయించిన వారికి వెయ్యేండ్ల పరిపాలనలో ఆ స్థితిని మరల కలిగించును (ప్రకటన 20:4). కాబట్టి హెబ్రీ. 6లో చెప్పబడిన అనేకమైన హెచ్చరికలు నిత్యజీవమును పోగొట్టుకొనుటకు సంబంధించినవి కావు కానీ క్రీస్తు వెయ్యేండ్ల పరిపాలనయందు ప్రవేశాన్ని కోల్పోవుట గురించి అనునది గమనించాలి. హృదయ కాఠిన్యత, అవిధేయత (హెబ్రీ. 3:7, 4:7) ఆత్మ సంబంధమైన ఎదుగుదల లేక పోవుట (హెబ్రీ. 11:6,8; హెబ్రీ. 10అ) క్రీస్తువైపుచూస్తూ పరుగెత్తే పరుగుపందెంలో తండ్రి చేసే శిక్షణను నిర్లక్ష్యము చేయుట ద్వారా, తన జ్యేష్ఠత్వమును అమ్ముకొనిన ఏశావువలె ప్రవర్తించుట ద్వారా క్రీస్తు వెయ్యేండ్ల పరిపాలనలో ప్రవేశిం చము. కానీ నిత్యజీవమునకు మాత్రము వారసులము. క్లుప్తంగా చెప్తే యేసుక్రీస్తును నమ్మి రక్షింప బడిన వారు వారి రక్షణను ఎన్నటికీ పోగొట్టుకొనరు. అనగా అందరికీ నిత్యజీవములో ప్రవేశమున్నది. ఈ నిత్యజీవము క్రీస్తు ద్వారా ఉచితముగా ఇవ్వబడింది. ఇది క్రియవలన కలిగినది కాదు. అయితే ఈ రక్షించబడినవారు క్రియల వలన పోగొట్టుకొను నది నిత్యజీవమునకు ముందుగా వచ్చు యుగము. అదే క్రీస్తు వెయ్యేండ్ల పరిపాలన లేక క్రీస్తు రాజ్యము. దీనికి ఇశ్రాయేలీయులు చక్కటి సాదృశ్యం ద్వితీ. 1-10 అధ్యాయా లలో ఇంకా అనేక భాగాలలో (1కొరింథీ. 10:1,13) చక్కగా చెప్పబడింది. ఇశ్రాయేలీ యులు రక్తము ద్వారా ఐగుప్తు నుండి విడుదల పొంది అరణ్యములో ప్రవేశింపవలెను అనేది దేవుని సంకల్పము. వాగ్దానము చేయబడిన భూమి క్రీస్తు వెయ్యేండ్ల పరిపాలనకు సాదృశ్యము ఈ అరణ్య ప్రయాణంలో వారు ఎన్నో శ్రమలు, సంకటములు, ఇబ్బం దులు ఎదుర్కొనవలసి వచ్చెను. జయించిన వారే కానానులో ప్రవేశించారు.

**(సశేషం)**

# క్రైస్తవ జీవిత దృక్కోణం

"మరియు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను. ఒక ధనవంతుని భూమి సమృద్ధిగా పండెను. అప్పుడతడు నా పంట సమకూర్చుకొనుటకు నాకు స్థలం చాలదు గనుక నేనేమి చేతునని తనలో తాను ఆలోచించుకొని నేనీలాగు చేతును. నా కొట్లు విప్పి, వాటికంటే గొప్పవాటిని కట్టించి అందులో నా ధాన్యమంతటిని, నా ఆస్తిని సమకూర్చుకొని, నా ప్రాణముతో ప్రాణమా అనేక సంవత్సరములకు విస్తారమైన ఆస్తి నీకు సమకూర్చబడియున్నది. సుఖించుము, తినుము, త్రాగుము, సంతోషినిచుమని చెప్పుకొందునను కొనెను. అయితే దేవుడు వెర్రివాడా ఈ రాత్రి నీ ప్రాణము అడుగుచున్నాను" అనెను.

ఇక్కడ ఒక ధనవంతుడు తాను సుఖవంతమైన జీవితం కోసం కష్టపడ్డాడు, శ్రమించాడు, పంటను పండించుకొని తాను ఊహించిన దానికంటే ఎక్కువ సంపాదించాడు. అనగా అతడు శారీరకంగా ఎంతో కష్టజీవి. ఇటువంటి వ్యక్తిని ప్రతి ఒక్కరు అభినందిస్తారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన "గీతాంజలి"లో ఆయన ఒక మాట వ్రాసాడు. దేవుడు ఎండలో కష్టపడి పనిచేసే వాడి దగ్గర వుంటాడు అని. మరి కొంతమంది పనే దైవంగా భావిస్తుంటారు. మంచిదే అటువంటి వారిని మనం అభినందించాలి. ప్రోత్సహించాలి. ఈ ధనవంతుడు కూడా అభినందనీయుడే. అంతమాత్రమే కాదు అతని ఆలోచనలు కూడా ఉన్నతంగా వున్నాయి. అనగా అతని మానసిక స్థితి ఎంతో గొప్పది. ఇప్పుడు వున్న ఇంటికంటే గొప్ప ఇంటిని కట్టించి విలాసవంతమైన సౌకర్యాలు ఏర్పాటు చేసుకొని అవసరమైన వాహనాలను తయారుచేసుకొని నేను సమాజంలో ఉన్నత స్థానంలో వుండాలి. అనే ఆలోచన ఎంతో గొప్పది. కాని ఇక్కడ ఈ ధనవంతుని ఆలోచన మన ఆలోచనలతో సరితూగుతున్నది కదూ. మనం కూడా ఇలాగే ఆలోచిస్తాం. అన్ని అభినందనియమైన ఆలోచనలే. ఇందులో ఎటువంటి స్వార్థం లేదు, ఎటువంటి మోసంలేదు, ఎటువంటి పాపములేదు. కాని ఆత్మీయంగా ఈ ధనవంతుడు దిగజారిపోయాడు. అనేకమైన సంవత్సరములకు ఆహారము ఉన్నది. తినుము, త్రాగుము సుఖించుము అనుచు తన జీవితానికి పాఠాలు నేర్పిస్తున్నాడు. ఇక్కడ ఇతడు దేవుని దృష్టిలో వెర్రివాడిగా ఎంచబడెను. ఎందుకంటే ఎంతో విలువైన జీవితాన్ని దేవుడు నీకు ప్రసాదిస్తే దానిని నీవు కేవలం ధన సంపాదన కొరకు, సమాజంలో నువ్వు ఎంతగొప్ప వాడివో నిరుపించుకోవడానికి వినియోగించి విలువైన నీ జీవితాన్ని వృధా చేసుకుంటున్నావు. అది కాదు దేవుడు నీ దగ్గర నుంచి కోరుకునేది. నిన్ను నీవు దేవునికి సమర్పించుకోగలగాలి. ఆ స్త్రీ తన జీవితాన్ని యేసు పాదాల చెంత ఉంచింది. ఆమె ఇతరులచే విమర్శించబడింది. కాని దేవుని దృష్టిలో అదే శ్రేష్ఠమైనది. బహుశా నీ జీవితం నీవు దేవునికి సమర్పించుకున్నప్పుడు నీకు రావలసిన ఆదాయం ఆగిపోవచ్చు. నిన్ను చేతకాని వాడిగా ప్రజలు అంచన వేయవచ్చు, నిన్ను హేళన చేయవచ్చు. నీవు దేవుని విషయంలో తీసుకున్న నిర్ణయం తప్పు అని అందరు ఖండించవచ్చు, ఆటంకపరచవచ్చు. కొన్నిసార్లు వారు చెప్పినదే నిజంలాగా కనిపిస్తు ఉంటుంది. ఎందుకంటే యేసు పాదాలకు పూసిన అత్తరు వలన ఆ స్త్రీ ఎటువంటి లాభం పొందలేదు, పైగ నష్టపోయింది. అనగా నీ జీవితం దేవునికి సమర్పించిన యెడల దేవునిలో నీవు చాలా త్యాగం చేయాలి. అయినప్పటికి లాభములను ఆశింపక క్రీస్తు కొరకు సమస్తమును వ్యర్ధపరచుకొని సమర్పించుకుంటే ఎంత ఆశీర్వాదం. ఈ స్త్రీ కూడా అలాగే

ప్రశంసించబడినది. పౌలు గారిని మనం పరిశీలించి నట్లయితే ఉన్నత పదవి, అధికారం మొత్తం దేవుని కొరకు త్యాగం చేశాడు. అందునుబట్టి ఆయన విలువగా ఎంచబ డ్డాడు. దేవుడు ఇలా అంటాడు. నీ దేహము దేవుని ఆలయం అని నీవు ఎరుగవా? ఈ దేహము, జీవితం దేవుని వలన మనకు ప్రసాదించబడింది.

కాబట్టి నిన్ను నువ్వు తెలుసుకో. దేవునిలోనే నిజమైన సంతోషం వున్నదని గుర్తించు. ఇతరుల గురించి ఆలోచించవద్దు. జీవితాంతం వారు నీకు తోడుగా వుండరు. నేను ఒకసారి ఫేస్‌బుక్‌లో ఒక ఫొటో చూశాను. ఒక వ్యక్తి యవ్వనకాలంలో వున్నాడు. అతని ముందు డబ్బు ఎగురుకుంటు వెళుతుంది. అతడు ఆ డబ్బును అందు కోవడానికి దానివెంట పరిగెడుతున్నాడు. అలా వృద్ధాప్యం వచ్చేంత వరకు పరిగెత్తుతున్నాడు. చివరికి అ డబ్బును పట్టుకొని ఆగిపోయే సరికి అతని కళ్ళముందు దారి కనిపించటంలేదు పెద్ద అగాధం కనిపిస్తుంది. అప్పుడు అతడు అనుకుంటున్నాడు ఈ డబ్బంతా వెచ్చించిన నాకు దారి కనిపించదు. ఎందుకు దీని వెంటపడ్డాను అని దుః ఖించటం మొదలుపెట్టాడు. ప్రియదేవుని బిడ్డా నీ జీవితాన్ని లోకానికి సమర్పించుకుంటే అది వ్యర్ధమే. దేవునికి సమర్పిస్తే ఆయన దానిని ఎంతో విలువగా ఎంచుతాడు. రోమా:12:1 "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును, దేవునికి అనుకూలమైన సజీవ యాగముగా మీ శరీరము లను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాను".

ఇప్పుడు నీవు నీ జీవితాన్ని ఏ కోణంలో చూడాలో ఆలోచించు. నీ దేహమును దేవుని పనికొరకు ఆయన సేవకొరకు వెచ్చించు. అది అత్యున్నతమైన పని. చాలా మంది భ్రమపడుతూ ఉంటారు. ఈ లోకంలో జీవించేదే గొప్పజీవితం. మరణించిన తరువాత ఎవరు ఎవరికి కారు, కాబట్టి నేను ఇక్కడే సుఖభోగాలను అనుభవిస్తాను అని నీవు అనుకొంటున్నావా. జాగ్రత్త నువ్వు దేవుని సమర్పించు కోకపోతే సాతానుడు నిన్ను తన అధీనంలోకి తీసు కుంటాడు. వాడి చేతిలో నీవు బానిసగా మారతావు. నీ మరణానంతరము నీకు ఇంకా చాలా జీవితం వున్నదని గుర్తించుకో. అది అసలైన జీవితం. ఎందుకంటే ఈ లోకంలో నువ్వు మహా అయితే 80 సంవత్సరాలు జీవించగలవు కాని మరణించిన తరువాత నీ ఆత్మ యుగయుగములు జీవిస్తుంది. దాని గురించి నువ్వు ఆలోచించవా. షేక్స్‌పియర్ అనే గొప్ప రచయిత ఒక కథ రచించాడు. అందులో సాతాను, ఒక రాజు దగ్గరకు వచ్చి రాజుగారు, మీరు జీవించిన కాలమంత మీకు ఏది ఇష్టమో చెప్పండి. నేను దానిని నీ కొరకు చేసిపెడతాను. కాని నువ్వు మరణించిన తరువాత నీ ఆత్మను మాత్రం నా ఆధీనంచేయాలి అని రాజు గారితో చెప్పింది. అందుకు ఆ రాజు గారు నేను మరణించిన తరువాత ఏమి అవుతుందో ఎవరికి తెలుసు? ఈ సాతానుకు తెలివి లేదు అనుకుంటు దాని ప్రతిపాదనకు తన అంగీకారం తెలుపుతాడు. అప్పటి నుండి ఆ సాతాను తను జీవించిన కాలమంత రాజుగారికి ఇష్టమైనవి ఇవ్వటం మొదలుపెట్టింది.

**(ఇంకావుంది)**

## -: పాఠకులకు గమనిక :-

**ఫేస్‌బుక్, ఆన్‌లైన్ తెలుగుబైబిల్ వెబ్‌సైట్, బైబిల్ క్విజ్ ద్వారా ఒక సంవత్సరం పాటు ఉచితంగా పత్రిక పొందుతున్న పాఠకులకు సంవత్సరం ముగిసిన వెంటనే వారికి పత్రిక నిలిపివేయడం జరుగుతుంది. కాబట్టి ముందు గానే సంవత్సర చందా రూ.250/- కట్టి రెన్యువల్ చేసుకోవడం ద్వారా 2 సంవత్సరాలు పత్రిక పంపబడుతుంది. పాఠకులు సహృ దయంతో అర్థం చేసుకొని వెంటనే సంవత్సర చందా పంప గలరు.**

**-ఎడిటర్**

స్త్రీల విభాగము

# గుణవతి



**శ్రీమతి కె. రేచల్ జోసఫ్,**
**హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్**

బైబిల్లో ఎంతోమంది స్త్రీలు ఉన్నారు. వారి సుగుణాలు నేర్చుకొని మన జీవితాల్లో వాటిని అనుసరించవలసిన అవసరం ఎంతో వుంది. "గుణవతి"లో ఎన్నో మంచి సుగుణాలు ఉన్నాయి వాటిని తెలుసుకుందాం.

"గుణవతియైన భార్య దొరుకుట అరుదు. అట్టిది ముత్యము కంటె అమూల్యమైనది" సామెత 31:10

"గుణవతి ఎంతో **యదార్థమైనది!** సత్యమైనది!! పవిత్రమైనది ఆమె భర్తకు ఆమెపై ఎంతో నమ్మకం. "చాలామంది కుమార్తెలు పతివ్రతా ధర్మము ననుసరించారు గాని వారందరిని నీవు మించిన దానవు" అని ఆమె భర్త ఆమెను పొగుడుతున్నారు. భర్తలను మోసం చేస్తూ యదార్థ ప్రవర్తన లేని స్త్రీలు నేర్చుకోవలసిన గుణం ఇది!

"గుణవతి" చాలా **కష్టపడి** పనిచేస్తుంది. చురుకు గల స్త్రీ . చీకటితోనే లేచి తన ఇంటి వారికొరకు పనిచేస్తుంది. తన కుటుంబం కొరకు మాత్రమే గాక పనివారికి కూడా భోజనం సిద్ధపరుస్తుంది. నడుము కట్టుకొని తన చేతులతో బలంగా పనిచేస్తుంది. "చురుకుగా నుండుట గొప్ప భాగ్యము" (సామె 10:12)

"సోమరీ, చీమల యొద్దకు వెళ్ళుము వాటి నడతలు కనిపెట్టి జ్ఞానము తెచ్చుకొనుము" (సామె 6:6)

"గుణవతి" చాలా **దయ** కలిగినది. ప్రేమ కలిగింది కూడ! తను కష్టపడి సంపాదించి జాగ్రత్త చేసినదంతా తానే అనుభవించాలనుకోదు. దీనులకు, దరిద్రులకు తన చేతులు చాపి పంచిపెడుతుంది. వారి అవసరాల్లో ఆదుకుంటుంది. "బీదలను కటాక్షించువాడు ధన్యుడు" (సామె 14:21)

''బీదలను కనికరించువాడు ఆయనను ఘనపరచువాడు" (సామె 14:31)

"గుణవతి'' తాను నోరు తెరిచి జ్ఞానయుక్తంగా మాట్లాడుతుంది. ఆమె కృపగల ఉపదేశాన్ని ఇతరులకు బోధిస్తుంది. కొందరు నోరు తెరిచి ముసలమ్మ ముచ్చటలు ఇతరుల పై చాడీలు, చెడ్డమాటలు పలుకుతారు. "ప్రభువా, నా నోరు నీ స్తుతిని ప్రచురపరచునట్లు నా పెదవులను తెరువుము" (కీర్త 51:15)

"గుణవతి" తన ఇంటివారి నడతలను జాగ్రత్తగా కనిపెట్టి వారిని సరిదిద్దుకుంటుంది. తన కుమారులు సత్ప్రవర్తన కలిగి దేవునికి మహిమకరంగా ఉండడం ఆమెకు ముఖ్యం. అందుకే వారి నడత కనిపెట్టి వారిని చక్కజేస్తుంది. కాబట్టి సత్ప్రవర్తన కలిగిన ఆమె కుమారులు ఆమెను ధన్యురాలని అంటారు.

"గుణవతి" దేవుని యందు **భయభక్తులు** కలిగిన స్త్రీ గనుకనే ఇన్ని గొప్ప గుణాలు కలిగివుంది. ఇలాంటి గొప్ప గుణాలు అలవర్చుకొని "గుణవతి"గా ఉండాలంటే దేవుని యందు భయభక్తులే ముఖ్యకారణం.

"అందం మోసకరం, సౌందర్యమూ వ్యర్థమే. యెహోవా యందు భయభక్తుల కలిగిన స్త్రీ కొనియాడబడును"

గుణవతులుగా, అమూల్యమైన ముత్యములుగా ఉండాలంటే దేవునియందు భయభక్తులు కలిగి వుండడమే ప్రాముఖ్యం! కాని మనలో చాలామంది అందానికి, ధనానికి, హోదాలకు, గొప్పతనాలకు ప్రాముఖ్యత నిచ్చి మంచిపేరు పోగొట్టుకుంటున్నారు. అందుకే "గుణవతియైన భార్య దొరకడం అరుదై" పోయింది. ముత్యములకంటె అమూల్యమైన గుణవతులుగ ఉండడానికి దేవునియందు భయభక్తులతో ముందుకు సాగిపోదాం.



బ్రదర్ కె.సామ్రాట్

12

# మదర్‌తెరీసా

ఆ హోమ్‌లో హాస్పిటల్లో చేర్చని వాళ్ళను వుంచేవాళ్ళు. ఆ గది ఎనిమిది చదరపు అడుగులుంటుంది. ముగ్గురు మనుష్యులను నేలపై వుంచవచ్చు. చికిత్సలు చేయడానికి మదర్ తెరీసాకు స్థలము వుండేది కాదు. ఒకరోజు రాత్రి ఒక మనిషి చనిపోయాడు. ఆ మర్నాడు ప్రొద్దున్న మిగిలిన వాళ్ళు పారిపోయారు. మదర్ తెరీసా బెదరలేదు. మున్సిపాలిటీకి వెళ్ళింది. అక్కడి చీఫ్ డాక్టర్ అహ్మద్, ప్రభుత్వం చేయాల్సిన పని ఆమె నెత్తిన వేసుకుంటుందని గ్రహించి మదర్ తెరీసాను కాళీఘాట్ ప్రఖ్యాత దేవాలయం దగ్గరకు తీసుకెళ్ళాడు. గుడికి ఆనుకుని రెండు హాల్స్ వున్నాయి వాటిని చూపించాడు. ఎప్పుడో కొన్నేళ్ళ క్రితం ఒక దాత భక్తులకోసం వాటిని కట్టించాడు రాత్రిపూట భక్తులు, యాత్రికులు తలదాచు కోవచ్చని. కాని అవి నిరుపయోగంగా వాడకుండా పడివున్నాయి. కాని కొందరు తాగుబోతులు, జూదగాళ్ళు వాడు కుంటున్నారు. మున్సిపల్ అధికారులు వారిని తరిమేకంటే, మదర్ తెరీసాకు అప్పగిస్తే రెండు పనులు అవుతాయని డాక్టర్ అహ్మద్ ఆలోచించారు. నూటయాభై పడకలతో చనిపోయే వాళ్ళను అక్కడ వుంచేంత వసతి వుంది. మదర్ తెరీసా వెంటనే ఒప్పుకుని నాలుగు రోజులు శ్రమించి ఆ ప్రాంతమంతా శుభ్రం చేశారు. 1958 ఆగష్టు 22 మదర్ తెరీసా 'నిర్మల్ హృదయ్' ప్రారంభించారు. ప్రభువుకు కృతజ్ఞతలు చెల్లించి చనిపోవటానికి సిద్ధంగా వున్న వాళ్ళకు ఆశ్రయం కల్పించుట మొదలుపెట్టింది. హిందూ దేవాలయం ప్రక్కనే అవసానదశలో వున్న వాళ్ళు అక్కడకు చనిపోవడంకోసం వెళ్ళటం జనానికి నచ్చలేదు. తనువు చాలించిన వాళ్ళకు క్రిస్టియన్ పద్ధతిలో అంతిమ సంస్కారాలు జరుగుతున్నాయని, క్రిస్టియన్లని ఖననం చేస్తున్నారని వదంతులు వ్యాపించాయి. డాక్టర్ అహ్మద్, మరో పోలీసాఫీసరు స్వయంగా పరిస్థితి ఏమిటో చూద్దామని వెళ్ళారు. నిర్మల్ హృదయ్‌లోకి అడుగు పెడుతూనే మదర్ తెరీసా కనిపించారు. మదర్ తెరీసా ఒక మనిషి యొక్క పుండును శుభ్రం చేస్తున్నారు. ఆ పుండు ఎంత దుర్వాసన కొడుతుందంటే ఆ గదిలో అడుగు పెట్టాలంటే భరించలేని దుర్వాసన. ఆ మనిషి పుండు శుభ్రం చేసి ఆ రోగితో అంటున్న మాటలు వాళ్ళకి వినిపిస్తున్నాయి. 'నీ మతం ఏమిటో మరి. ఆ మత ప్రార్థనలే చేసుకో. నాకు తెలిసిన ప్రార్థన నేను చేస్తాను. యిద్దరం కలిసి ఈ ప్రార్థన చేద్దాం. దేవునికి ప్రీతి పాత్రం అవుతుంది' అంటున్నారు మదర్ తెరీసా. మదర్ ఆఫీసర్లను చూసి, తాము చేస్తున్న పని ఏమిటో వాళ్ళకు చూపించబోయారు. పోలీసాఫీసరు కళ్ళనిండా నీళ్ళు నిండు కున్నాయి. అవసరంలేదు మదర్ అన్నాడు. బయట జనం గుంపుగా వున్నారు. వాళ్ళకేసి తిరిగి 'సరే మీ తల్లులు, చెల్లెళ్ళు ఈ పని చెయ్యడానికి ఒప్పిస్తే మదర్‌ని యిక్కడ నుండి నేను పంపేస్తాను. అంత పని చేయడం మన వల్ల కాదు. ఆమె ఒక సెయింట్ గనుక చేస్తుంది' అన్నారు. ఆఫీసర్లు ఇలా జోక్యం చేసుకున్నా కూడా, కాళీమాత గుడిపూజార్లు ఆమెను అక్కడ నుండి పంపించాలని ప్రయత్నిస్తూనే వున్నారు. కాళీమాత దేవాలయం పరిసరాల్ని ఒక క్రైస్తవ మత మిషనరీకి ధారాదత్తం చేయడం బ్రాహ్మణ పురోహితులకు తల తెగి పోయినట్లు వుంది. ఈ ఏర్పాటును తప్పించాలని చాలాసార్లు మున్సిపాలిటీకి అర్జీలు పెట్టారు. అంతలో ఒకరోజున ఒక వింత సంఘటన జరిగింది. ఒక యువ పురోహితుడు రక్తం కక్కుకున్నాడు. నిండా ముప్పయ్యేళ్ళైనా వుండవు. అతనికి క్షయ. బాగా ముదిరిన దశలో ఉంది. అలా ముదిరిపోయిన కేసుల్ని ఏ ఆసుపత్రిలోను చేర్చుకోరు. శారీరకంగా, మానసికంగా జబ్బుపడ్డ ఆ పురోహితుడ్ని ఆఖరుకు నిర్మల్ హృదయ్‌కి తీసుకువచ్చారు. మదర్ తెరీసా అతనికోసం

ప్రత్యేక స్థలం కేటాయించి చికిత్స మొదలుపెట్టారు. అతనికి కోపం, అవమానం రెండూ కలిగాయి. కాని రోజులు గడిచేకొద్దీ ఆ పరిస్థితికి సర్దుకుపోయాడు.

మదర్ తెరీసా చూపుతున్న ప్రేమని ఆ పురోహితుడు చవిచూశాడు. కొంతకాలానికే మనశ్శాంతితో చనిపోయాడు. మదర్ తెరీసా అతని దేహాన్ని పంపించారు. ఆ దేవాలయ పురోహితులు తమ తోటి మనిషి పట్ల నిర్మల్ హృదయ్ చూపించిన శ్రద్ధ ఏమిటో గుర్తించారు. వాళ్ళు ఆ పని చేయలేకపోయారు. చేయడానికి ఇష్టపడనూ లేదు. కలకత్తాలో, సమీప ప్రాంతాల్లో అనేక రకాల మత, సాంఘీక సంస్థలు వున్నాయి. పేదలకి, రోగులకి చేయూతనిస్తుంటాయి. కానీ, ఏ ఒక్కటీ అవసానదశలో వున్న వాళ్ళనీ, యిళ్లు లేని వాళ్ళను, హాస్పటల్స్ చేర్చుకోని వారిని చేరదీయవు. మదర్ తెరీసా, ఆమె సిస్టర్లు కరుణతో, జాలితో ఈ శిధిల శరీరాలను దిక్కూ మొక్కూలేని జీవాల్ని స్పృశించాలి అనే ముఖ్య విశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. నిర్మల్ హృదయ్‌లో స్ట్రెచర్ మీద వున్న ప్రతి జీవి జబ్బుపడి, అనాధగా చనిపోతూ వున్న క్రీస్తే అనే ధృఢవిశ్వాసం వున్నందువలన ఆ పని మనస్ఫూర్తిగా చేయగలుగుతున్నారు. మత మార్పిడి చేయడం, మృతదేహాల్ని క్రైస్తవ ఖననాలకి పంపడం కాదు. అలా కావాలని ప్రత్యేకంగా అర్థిస్తే తప్ప అలా జరుగదు. వాళ్ళ అభిష్టానికి వ్యతిరేకంగా చెయ్యటం మదర్ తెరీసా దృష్టిలో మహాపాపం.

కలకత్తాలో గుడి బయట అడుక్కునే భిక్షకులకు, స్థానికంగా రిక్షాలు లాక్కునే వాళ్ళకు, క్షయ ప్రబలంగా వుంటుంది. నిర్మల్ హృదయ్‌లో చేరాక వాళ్ళకు వైద్య సహాయంతో పాటు ప్రేమ పంచబడుతుంది. అదీ ముక్కు ముఖం ఎరుగని వాళ్ళ దగ్గర నుండి. అంతిమ సంస్కారం మృతుని కోరిక మీదే జరగాలని మదర్ జాగ్రత్త తీసుకునేవారు. రోగుల్ని అపస్మారక స్థితిలో అక్కడికి తీసుకువస్తే ఏ మతమో చెప్పలేదు గనుక వాళ్ళ దేహాలపై గుర్తులనుబట్టి సుంతీ వుంటే ముస్లీం అనీ, పచ్చబొట్టు వుంటే హిందువులని, ఏ గుర్తులు లేకుంటే హిందూ సంప్రదాయం ప్రకారం కర్మకాండలు జరిపించేవారు. ముఖ్యంగా సిస్టర్లు నగరంలో వున్న ఇతర పేదల్లాగానే పేదలు. సిస్టర్లకి మరింత మెరుగైన భోజనం, శుభ్రమైన బట్టలు వుండవచ్చుగాని స్వయంగా వరించుకున్న పేదరికం వల్ల, గుమ్మంలో నుంచి వాళ్ళతో ఒకటైపోతారు. మరణించే వారికి ఆదరణ కలిగించి, వాళ్ళు దేవుణ్ణి చూడబోతున్నారని చేప్పేవారు. ప్రతి మనిషి పుట్టుక దేవునిలో నుంచే, ప్రతి మానవునిలోను దేవుడుంటాడు. మదర్ తెరీసాకు జీసస్ దేవుడు, ఒక హిందువుకు శివుడు, ముస్లింకు అల్లా. మరణిస్తూ వున్న ఆ మనిషి చేతిని పట్టుకుని తను చేసిన పాపాల్ని క్షమించాలని తమ దేవుని వేడుకొనమని చెబుతారు. చనిపోవడానికి ఇక్కడ కంటే మంచి చోటులేదు అని చాలామంది మదర్ తెరీసాతో అన్నారంటే ఎలాంటి పరిస్థుతులు నెలకొన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఒకరోజు రోడ్డు ప్రక్క కాలువలో పడివున్న ఒకతన్ని మదర్ తెరీసా కాపాడి నిర్మల్ హృదయ్‌కి తీసుకొచ్చారు. అతని ఒళ్ళంతా పుళ్ళతో వుంది. అతన్ని శుభ్రంచేసి, స్నానం చేయించి, పుళ్ళ మందులు వేశారు. అంతసేపూ అతను ఏమీ మాట్లాడలేదు, ముఖంలో భయమూ కనిపించలేదు. అతను మదర్ తెరీసా వైపు చూసి ఓ చిరునవ్వు నవ్వి, నేను బతుకంతా వీధుల్లో పశువులాగానే బతికాను. యిప్పుడు దేవతలా చనిపోతున్నాను అన్నాడు. తీసుకొచ్చిన మూడు గంటల్లోనే అతను చనిపోయాడు. ఆ సంఘటన మదర్ తెరీసాకు ఎంతో తృప్తినిచ్చింది.

ఒకసారి మదర్ తెరీసా ఒక ఆడమనిషిని చెత్తకుండీలో చూశారు. జ్వరంతో మూలుగుతుంది. మదర్ తెరీసా ఆమెను కాళీఘాట్ దగ్గర నిర్మల్ హృదయ్‌కి చేర్చి, నీళ్ళతో శుభ్రం చేసి, మందులు వేశారు. ఎందుకలా చెత్తకుండీలో పడివున్నావని మదర్ ఆమెను అడిగారు. కన్న కొడుకే ఆమెను అక్కడ పడేసి వెళ్ళిపోయాడని, తను తన గుండెను పిండేసే విషయం ఆమె జ్వరమూ కాదు, చనిపోతూ వుండటము కాదు. తన కన్న కొడుకే దిక్కులేకుండా చెత్తకుండీలో పారేశాడనే బాధ ఎక్కువని చెప్పింది. మదర్ తెరీసా ఆమె కొడుకును క్షమించమని అడిగారు. చాలాసార్లు బతిమాలగా ఆమె తన కొడుకును క్షమించింది. మదర్ తెరీసా చేతుల్లో ప్రశాంతంగా తనువు చాలించింది. ఆమె ఆఖరుగా మదర్ తెరీసాతో కృతజ్ఞురాల్ని అని చిరునవ్వు నవ్వింది. అంత చక్కని చిరు నవ్వు కానుకగా ఎన్నడూ అందుకోలేదని మదర్ తెరీసా తృప్తిపడింది. ఇలా ఎందరో చనిపోతూ ప్రశాంతంగా దేవుని సన్నిధికి చేరుతున్నారు. కొందరు బాగుపడి వెళ్ళిపోతున్నారు. **(సశేషం)**

# తండ్రి బాధ్యత

బైబిల్లో అనేకమంది పురుషులు దేవునియందు భయభక్తులు కలిగి జీవించి వారి కుటుంబాలకు ఆశీర్వాదకరంగా ఉన్నారు. సహజంగా ప్రతి కుటుంబంలో పురుషులు బిజీగా ఉండటం మనం చూస్తూ ఉంటాము. వాళ్ళకు చాలా బాధ్యతలు ఉంటాయి. కొంతమంది చాలా కష్టపడి డబ్బు సంపాదించి ఇంటికి తెచ్చి ఇస్తూ ఉంటారు కాని కుటుంబంలో పిల్లల సంగతి ఆలోచించే సమయం ఉండదు. మానసికంగా, శారీరకంగా, ఆర్ధికంగా ఏదో కొంత ఆలోచించవచ్చేమో కాని ''ఆత్మీయంగా'' ఆలోచించరు. అయితే బైబిల్లో చాలామంది పురుషులు ఆత్మీయంగా వాళ్ళ కుటుంబాల విషయంలో శ్రద్ధ వహించినవారున్నారు. వారి గురించి క్లుప్తంగా తెలుసుకుందాం!

**కొర్నేలి** : అ.కా 10వ అధ్యాయంలో చాలా విషయాలు ఆయనగురించి వ్రాయబడి ఉన్నాయి. ఆయన గుణాలు 1. భక్తిపరుడు 2. నీతిపరుడు 3. దేవుని భయము 4. మంచిపేరు 5. దర్శనములు చూచుట, తగ్గింపు మనస్సు, అన్నిటికంటె ముఖ్యంగా "ఇంటివారందరితో దేవుని యందలి భయభక్తులు గలవాడు", ధర్మకార్యాలు చేసేవాడు. బంధువులు స్నేహితులు కూడ యేసయ్య గురించి వినాలని ఆశపడువాడు. వందమంది మీద అధికారియైన ఒక ఆఫీసర్ గారు ఎంతో బిజీగా, అఫీషియల్‌గా ఉండవలసిన వ్యక్తి ఇంత మంచి లక్షణాలు కలిగి ఉండటం చాలా అరుదు. తన ఇంట్లో పనివారు కూడ దేవునియందు భయభక్తులు కలిగిన వారిగ చూస్తాము. అనేక మంది పురుషులు ఈ రోజుల్లో మేము చాలా బిజీ, మామూలు విషయాలు ఆలోచించే టైం లేదు అంటారు. అందుకే అనేక మంది యవ్వన బిడ్డలు ఎంత పాడైపోతున్నారో టి.విలో, న్యూస్ పేపర్స్‌లో చూస్తుంటాము. వింటుంటాము. తండ్రులారా! దయచేసి మీ పిల్లల విషయంలో బాధ్యతా యుతంగా, ఏకాగ్రత కలిగి కొర్నేలి లాగా కుటుంబంతో సహ దేవునియందు భయభక్తులు కలిగి ఉండాలి. కొర్నేలి గార్కి ఉద్యోగం, బయట బాధ్యతలు లేవా? అక్కా, చెల్లెళ్ళు, అన్నద మ్ములతో వ్యవహారాలు లేవా? అన్ని బాధ్యతలతో కుటుంబంతో సహ దేవునియందు భయభక్తులు కలిగి ఉండటం, తన దగ్గర సైనికులను కూడ భక్తిపరులుగా తయారు చేసిన విధానాన్ని మనం గమనించి నేర్చుకోవాలండి. మన పిల్లలు మన వ్యక్తిగత జీవితాన్ని, మన ఉనికిని, మన గౌరవాన్ని చాటే వారుగా ఉన్నారు.

**యెఫ్తా:** న్యాయాధిపతులు 11వ అధ్యాయంలో యెఫ్తా దైవభక్తి గల తండ్రి. అతను దేవుని ద్వారా యుద్ధంలో జయం పొందుకోవడం, అతని విశ్వాసం, దేవుని ఆత్మ చేత నింపబడి దేవునితో బలవంతుడైన తండ్రిని, కుమార్తె గమనించింది. తన ప్రవర్తన తన కుమార్తెకు ఆత్మీయజీవితంలో విశ్వాస జీవితంలో ఎదుగుటకు మాదిరికరంగా ఉంది. మన విశ్వాస జీవితం మన పిల్లలలో ప్రతిబింబిస్తుందా? ప్రతిఫలిస్తుందా? (మత్తయి 7:16-20), ఒక యవ్వనస్తురాలు తండ్రి యొక్క ధైర్యాన్ని పొందుకొని తండ్రి మొక్కుబడిని నెరవేర్చుటకు సాహసం చేసింది. దేవుని దగ్గర తన తండ్రి మాట తప్పేవాడుగ గాని దేవుని దగ్గర ఓడిపోయేవాడుగా గాని ఉండడం ఇష్టంలేక తన యవ్వన వయస్సుని దేవునికి త్యాగం చేసి సమర్పించు కుంది. 1సమూయేలు 17అధ్యాయం అంతా చదివినట్లయితే దావీదు తన చిన్న వయస్సులో తాను చేసిన సాహస కార్యాలు విశ్వాసపు మాటలు, ధైర్యపు మాటలు, సౌలు రాజు గారు విన్నప్పుడు, స్వయంగా తన కళ్ళతో చూచినప్పుడు " ఈ యవ్వనుడు ఎవరి కుమారుడు"? "ఈ పడుచువాడు ఎవరి కుమారుడో అడిగి తెలుసుకొనుడి" అన్నాడు. తండ్రి గౌరవాన్ని, ఉనికిని చాటే వాడిగా దావీదుగారిని మనం చూస్తున్నాం. తండ్రులే పిల్లలకు అలంకారము. తండ్రిని గౌరవించి తన తండ్రి ఊరు, వంశమును, తెలియజేస్తున్నాడు. క్రీస్తుయేసు

వంశావళిని గుర్తు చేస్తున్నాడు. బేత్లెహేము యొక్క ప్రాముఖ్య తను చెలియజేస్తున్నాడు.

"నా తండ్రిని గురించి కొంచెము నేను తెలియపర్చాలి అనుకుంటున్నాను. ఇది నా జీవితానికి గొప్ప సాక్ష్యము. మా తండ్రికి మేము ఏడుగురు సంతానము. ప్రతి ఒక్కరి విషయములో ఆయన చూపించింది తండ్రి ప్రేమ, బాధ్యత. ప్రేమ ద్వారా బాధ్యత వస్తుంది. నాన్నకి తెల్లవారు జామున ప్రార్థన చేసే అలవాటుంది. ప్రార్థనలో ఏడుగురి పేర్లు ఎత్తి పెద్దగా ప్రార్థన చేసేవారు. మానసికంగా, శారీరకంగా మా విషయంలో ఆయన బాధ్యతను నేను చిన్నప్పటి నుండి గమనించాను. మా కొరకు ఆయన స్వయంగా కష్టపడేవారు. ఆయనలో నేను చూసింది క్రమశిక్షణ. మాకు అదే క్రమశిక్షణ నేర్పించారు. చదువు విషయంలో, బట్టలు, ఉద్యోగాలు ఇలా అన్నీ విషయాల్లో శ్రద్ధ తీసుకొనేవారు. ఈ రోజున మేము ఆత్మీయంగా మానసికంగా ఆర్థికంగా క్షేమ స్థితిలో ఉండుటకు నాన్న గారి ప్రార్థనే కారణమని చెప్పుటకు గర్వపడుతున్నాను. నేనొక దైవసేవకురాలిని. బెంగళూరు పట్టణంలో బీదవారి మధ్య సేవకురాలిగా ఉన్నాను. నా భర్త నేను కలసి దేవుని కృప వలన ఒక సంఘాన్ని కట్టాము. మా వారు చనిపోయి 3సంౘలు అయ్యింది. ఆయన విడిచిపెట్టిన పనిని నేను కొనసాగి స్తున్నాను. ఇలా సేవా పరిచర్యలో భర్తలేకుండా ఒంటరిగ సేవజరిగిస్తున్నాను అంటే .. మా మామగారైన కృపాదానం గారి ఆత్మీయ ప్రార్థనా జీవితం, ఆయన ధైర్యసాహసాలు, సేవ పట్ల ఆయన పౌరుషం నాకు చాలా ఇన్స్పిరేషన్. మా మామగార్కి ఏదైనా సమస్య వచ్చిందంటే మనుష్యుల దగ్గర మాట్లాడడు, నేరుగా చర్చి లోపలికి వెళ్ళి బలిపీఠము దగ్గర ప్రార్థించేవారు. దేవునితో పోట్లాడేవారు. తెల్లవారు జామున ఒక్కొక్కసారి రాత్రంతా ప్రార్థించేవారు. ఏం చేశారు మామయ్య రాత్రంతా? అని అడిగితే నా అవసరత ఏదో రాత్రంతా అదే అడిగాను అనేవారు. ఖచ్చితంగా దానిని పొందుకునేవారు. ఒక్కరి ప్రార్థన ద్వారా ఒక సంఘము, ఒక అనాధ శరణాలయము ఒంగోలులో స్థాపించారు. అనేక ఆత్మలు రక్షించారు. మేము చాలా విషయాలు ఆయన విశ్వాస ప్రార్థన జీవితం ద్వార నేర్చుకున్నాము. ఆయన బిడ్డలమైన మేము దేశ విదేశాల్లో సేవ జరిగిస్తున్నాము.

జ్ఞానముగల స్త్రీ, వివేకముగల స్త్రీ, సుబుద్ధిగల స్త్రీ, నెనరు గల స్త్రీ, అని బైబిల్లో వ్రాయడింది కాని జ్ఞానముగల పురుషుడు, వివేకముగల పురుషుడు, సుబుద్ధిగల పురుషుడు, నెనరుగల పురుషుడు ఎందుకుండకూడదు? బైబిల్లో అనేక మంది పురుషులు భార్యాబిడ్డలతో కుటుంబ జీవితం గడుపుతూ దేవునితో నడిచిన హనోకు, భూలోకము చెడిపోయి ఉండగా సమస్త శరీరలు తమ మార్గములను చెరిపివేసుకొని యుండగా వారి మధ్య కుటుంబంతో జీవిస్తున్నటువంటి నోవహు నిందా రహితుడుగా, నీతిపరుడుగా జీవించారు. దేవునికి నోవహుకి జరిగినటువంటి సంభాషణ, చాలా ఆశ్చర్యం. ఎంత మంది పురుషులు అలా దేవునితో సన్నిహిత సంబంధము, నమ్మకత్వము కలిగినవారిగా ఉన్నారు? ఈ తరము వారిలో నీవే (నోవహు) నా యెదుట నీతిమంతుడవై యుండుట చూచితిని గనుక నీవును నీ యింటి వారును ఓడలో ప్రవేశించుడి. తండ్రిగా, భర్తగా నోవహు నీతిని బట్టి ఆ భయంకర జలప్రళయం నుండి ఆ కుటుంబం రక్షించ బడింది. యోబు 1:5 ఉదయకాలపు బలి అర్పణ 10మంది కొరకు, కేవలం హృదయంలో దేవుని దూషించారేమో అని. ఇక్కడ యోబు యొక్క ఉద్దేశం గురించి ఆలోచించాలి. ఆయన పిల్లల పవిత్రతను గురించిన ఆలోచన. వారి యొక్క ఆత్మీయ, మానసిక, శారీరిక పవిత్రతను గురించి చేసిన గొప్ప కార్యము.

తండ్రులారా! భర్తలారా! పురుషులారా! మీ నీతి క్రియలను బట్టి లోక పాపమాలిన్యం నుండి, శాపం నుండి, రాబోయే నరకం నుండి మీ కుటుంబాల రక్షణ కొరకు ఏం చేస్తున్నారు? ఒక తండ్రిగా, భర్తగా మీ బాధ్యతలను గుర్తెరిగి కుటుంబ ఆత్మీయ, శారీరక, మానసిక అవసర తలను తీర్చుటకు దేవుని మీద ఆధారపడుతు కుటుంబాల రక్షణకై భారం కలిగి ఉండాలని ఆశిస్తున్నాం

సైన్స్

# సునామీ

సునామీ అనే పదం అందరికి సుపరిచితమే. సునామీ అంటే "పెద్ద అల" అని అర్థం. సముద్ర గర్భంలో ఉండే అగ్ని పర్వతాలు బద్దలవడం వలన లేదా సముద్రంలో వచ్చే భూకంపాల వలన ఈ సునామీలు ఏర్పడతాయి. సునామీ రావడానికి ముందు దాదాపు 30 నుండి 40 నిమిషాలు సముద్రం చాలా ప్రశాంతంగా ఉండి అతి తక్కువ సమయంలోనే భయంకరమైన పెద్ద పెద్ద అలలతో తీరాన్ని దాటి తీవ్రమైన వేగంతో ప్రవహిస్తాయి. ఆ వేగానికి మహా వృక్షాలు, ఇళ్ళు, రోడ్లు, పెద్ద పెద్ద కట్టడాలు, వాహనాలు ఒకటేమిటి అన్నీ నాశనమౌతాయి. సునామీకి ప్రపంచం మొత్తాన్ని తుడిచివేయగలిగే శక్తి ఉంటుందని శాస్త్రవేత్తల అంచనా. సునామీ వచ్చినపుడు సముద్రపు అల 100 అడుగుల నుండి 500 అడుగుల ఎత్తు ఉంటుందట. సునామీ అల వేగం గంటకి 800 కి.మీ అంటే జెట్ విమానం కన్నా వేగవంతమైనది. అంత వేగంగా వచ్చే అలను తట్టుకోవడం అసాధ్యం. 2004లో వచ్చిన సునామీ 23000 అణుబాంబులతో సమానమైనదని నిపుణుల అభిప్రాయం. విజ్ఞానశాస్త్రం ఎంతగానో అభివృద్ధి చెందిన ఈ కాలంలో కూడా సునామీ రాకను నియంత్రించలేము. నియంత్రించలేకపోగ దాని రాకను కనీసం ముందుగా గుర్తించలేము. మనం గుర్తించేటప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. నష్టం జరిగాక సునామీ ప్రభావాన్ని, జరిగిన నష్టాన్ని అంచనా వేయడం తప్ప ఏమి చేయలేము. ఇలాంటి ప్రకృతి వైపరిత్యాలను గురించి ఒక్క క్షణం ఆలోచిస్తే ఆధునికత, అభివృద్ధి అనుకుంటున్న సైన్స్ దాని పరిమితులు, దేవుని ఉనికి, దేవుని శక్తి తెలుస్తాయి.

***"సముద్రము ఆయనది ఆయన దానిని కలుగజేసెను" కీర్తనలు 95:5***

***"ఆయన ఆకాశమును భూమిని సముద్రమును దానిలోని సర్వమును సృజించినవాడు" కీర్తనలు 146:6***

ఒక వస్తువు యొక్క పరిపూర్ణ నియంత్రణ దానిని నిర్మించిన వాని చేతిలోనే ఉంటుంది. సముద్రాన్ని, దానిలోని జీవరాశులను సృష్టించింది, దానికి సరిహద్దు నియమించింది అనంతుడైన దేవుడు.

***"సముద్రము దాటలేకుండునట్లును, దాని తరంగము లెంత పొర్లినను అవి ప్రబలలేకయు, ఎంత ఘోషించినను దాని దాటలేకయు ఉండునట్లును నిత్య నిర్ణయము చేత దానికి ఇసుకను సరిహద్దుగా నియమించిన నాకు మీరు భయపడరా? నా సన్నిధిని వణకరా? ఇదే యెహోవా వాక్కు." యిర్మీయా 5:22***

సృష్టికర్తయైన దేవునికి సమస్తము సాధ్యమే, ఆయన మాత్రమే ఈ సృష్టిని నియంత్రించగలడు. అటువంటి దేవునికి మానవుడు భయపడాలి కదా! దేనికి సరియైన వివరణ ఇవ్వలేని, దేనిని నియంత్రించలేని సైన్స్‌ను ఆధారం చేసుకొని దేవుని ఉనికిని ప్రశ్నించడం అనేది మానవుని అవివేకానికి తార్కాణం.

***"ఆకాశమందును భూమియందును సముద్రములయందును మహాసముద్రములన్నిటియందును ఆయన తన కిష్టమైనదంతయు జరిగించువాడు" కీర్తనలు 135:6***

***"సముద్ర జలములను పిలిచి వాటిని భూమి మీద ప్రవహింపజేయువాడు ఆయనే" ఆమోసు 9:6***

***"తన బలము వలన ఆయన సముద్రమును రేపును" యోబు 26:12***

***"సముద్రము దాని గర్భము నుండి పొర్లిరాగా తలుపుల చేత దానిని మూసినవాడెవడు?" యోబు 38:8***

సర్వశక్తిమంతుడు, సర్వమును సృజించినవాడు, ప్రకృతిని నియంత్రించగల బలసంపన్నుడు అయిన ఆ దేవదేవుని ఆశ్రయించి ఆయన పాదసన్నిధిలో భయభక్తులు కలిగి జీవిస్తూ ఎటువంటి విపత్కరమైన పరిస్థితులైన బలవంతుడైన దేవునితో కలసి ఎదుర్కొందాము. జయజీవితాన్ని పొందుకుందాము.

సాక్ష్యము

# నమ్మదగిన దేవుడు

నా బాల్యం, నా అవివాహిత జీవనం ఖమ్మం జిల్లా మధిరలో విలువలున్న క్రైస్తవ సాంప్రదాయ కుటుంబంలో, డా॥కానుకొలను ప్రభాకర్‌గారు, డా॥వసంతమ్మగార్లకు, ప్రధమ సంతానంగా 1966లో జన్మించాను. అపురూపంగా, అల్లారు ముద్దుగా ఆప్యాయత నిండిన అనురాగం, గారాలపట్టిగా పెరిగాను. మా నాన్నగారి తల్లిదండ్రులు, తోబుట్టువులు అమ్మకు దగ్గర బంధువులు పేరున్న విశ్వసులే. వారందరి కన్నీటి ప్రార్థనా ప్రవాహం నన్ను దైవ రాజ్యంలోకి కొట్టుకొని వచ్చింది. నా తల్లిదండ్రులు ఖమ్మము హెడ్‌క్వార్టర్స్ ఆస్పత్రిలో ఘనమైన సేవలు చేసి అనేకమంది స్నేహితుల్ని, సన్నిహితుల్ని పొందారు. నా విద్యాభాసం అక్కడే కాన్వెంటు లోనే. ఆ తర్వాత అనీ హైస్కూలు సికింద్రాబాదు హాస్టల్లో. పదవ తరగతి పాస్ అయ్యాక సెయింట్ థెరిసా కాన్వెంటులో చదివాను. ఇంటరు తర్వత నా దారి వేరైయింది. డాక్టరు కావాలానే పట్టుదలతో నాన్నగారు ఎంతో డబ్బు వ్యయం చేసి పేరున్న రామచంద్రా మెడికల్ కాలేజి మద్రాసులో చేర్చారు. అక్కడే నన్ను ప్రభువు స్వయంగా సంధించారు. కష్టపడడం ఇష్టపడక, ఎన్నో వినోదాలు విలాసాలు ఇష్టంగా ఉండేవి. అయితే పాప భీతి ఉండేది. పవిత్రత కాపాడుకోగల్గాను. నా తర్వాత అమ్మనాన్నలకు డానియేల్ (పెద్ద తమ్ముడు) పుట్టాడు. విది వైపరిత్యం తమ్ముడు మానసిక వికలాంగుడు మా అమ్మ గుండెల నిండా దు:ఖ:నింపుకొని, వారి వైద్య సేవల భాధ్యత లతో పాటు ఎంతో ధన వ్యయంతో యిద్దరు పనివాళ్ళ సంరక్షణలో ఎన్నో స్థలాలలో ప్రత్యేక చికత్స చేయించి, విఫలులై కృంగిపోయిన సమయంలో అజ్ఞాతవ్యక్తుల్లో నుంచి దేవుడు తన సేవకున్ని ఎన్నుకొని ఈ మాటలతో మమ్మును దర్శంచారు. విశ్వాసం పగటివేళ వెలుగు ఉన్నప్పుడు స్తోత్రాలు చెల్లిస్తుంది, జీవంగల విశ్వాసం కారుచీకట్లో కూడా కీర్తిస్తుంది. మన కోసం మౌనంగా దేవుడే ఏర్పాటు చేస్తాడు అవి ఆశ్చర్యకారకాలైన అనురాగ బహుమతులు కని విని ఎరుగని అద్భుతాలు అవి మన కోసమే. మాకు ఈ వాక్యాలు ఎంతో ఆదరణను కలిగించాయి. మా తలిదండ్రుల లోటును ఆవేదనను గమనించిన నేను ఎడారిలో సెలయేర్లు పుస్తక భావాలు జీర్ణించుకోవడానికి ఆరంభించాను. ఆయన ఎదపై విశ్వాసంగా ఆనుకొని నిదురపోవాలి. ఆయన కృప మనకు బలము, జీవము.

హోషేయ 2:15. (శ్రమగల) లోయను నిరీక్షణ ద్వారముగా చేసెదను. మా తమ్ముడు డానీ వల్లనే నేడు 70కి పైగా విద్యార్థులు, మానసిక వికలాంగులకు సేవాసదనం గొప్ప ఆశ్రయం. మా చిన్నతమ్ముడు ఇంజనీరింగ్ చదవాలని వెళ్ళే తరుణంలో నాన్నగారు మరణించారు. మేము ఒంటరి వాళ్ళమయ్యాము. అమ్మపై బోలెడు భారం పడింది. యోబు 34:29, ఆయన సమాదానం కలుగ జేయును. అమ్మ మౌనంగా రోదిస్తు చేసిన ప్రార్థన విజ్ఞాపన నాకు జ్ఞాపకమే. 1998లో నాన్న గారి మరణం నాలో ఆధ్యాత్మిక చింతన కల్గించింది. ఆ రోజుల్లోని ప్రార్థనా బృందం నాలో దైవాశీర్వాదాలనందుకొనే రక్షణ అనుభవాన్ని సిద్ధపరచి ఆ పరిశుద్దాత్మ ప్రేరణ వల్ల నా స్వీయ రక్షకునిగా నా సాక్ష్యం స్థిరపర్చారు. యెషయా 54:10 చివరి భాగం "పర్వతములు తొలగిపోయినను మెట్టలు తత్తరిల్లినను నా కృప నిన్ను విడిచిపోదు సమాధాన విషయమైన నా నిబంధన తొలగిపోదు; అని నీయందు జాలిపడు యెహోవా సెలవిచ్చుచున్నాడు. ఆహా ఎంత గొప్ప ఆదరణ, ఎంత గొప్ప నిబంధన చెప్ప శక్యంగాని ఆనందంతో నా హృదయం ఉప్పొంగింది. నా ప్రభువు కృప, నిబంధన నాలోఉంది, అప్పటి నుండి ప్రభుపుపై ప్రేమ పెంపొందింది. వాక్యం చదవాలనే తపన నాలో కలిగింది. అప్పుడు క్రీస్తు నన్ను

ఆత్మీయ లోతుల్లో క్రొత్త అనుభవాలతో నింపారు. 1989లో ప్రభువు చిత్తానుసారంగా అమ్మ నా కొరకు ఒక మారు మనస్సు పొందిన వ్యక్తితో రామ్‌గారితో వివాహం జరిగించారు. అయితే నాటికి కుటుంబీకులలో కొందరే విశ్వాసులుగా ఉన్నారు. నా భర్త అంచంచల విశ్వాసం, దైవ ప్రీతి, నిజాయితీ, అండదండలు నాకు పెన్నిధిగా నిలిచాయి. ఎన్నో అనుభావాలు యిద్దరం పంచుకోగలిగాం కానీ సంతానం కలుగలేదు. హబక్కూకు 1:2, నేను మొరపెట్టినను నీవెన్నాళ్ళు ఆలకింపకుందువు? యిదే ప్రశ్న. నేను 16 సంIIలుగా ఎదురుచూస్తూ వచ్చాను. హబక్కూకు 2:5, దర్శన విషయము నిర్ణయకాలమున జరుగును, అది తప్పక నెరవేరును, ఆలస్యంగా వచ్చినను దానికొరకు కనిపెట్టుము. అది తప్పక జరుగును అను వాక్యాన్ని బట్టి కొంత ధైర్యంగా ఉన్నాను. కొన్ని సంIIలు మస్కట్‌లో వైద్య వృత్తి చేశాను. ప్రపంచములో పుస్తకాలు రచించి గొప్పగా వైద్యం చేస్తున్న నిపుణుల వద్ద గర్భం గురించిన పరీక్షలన్ని చేయించుకున్నాను. అందరు పెదవి విరిచిన వారే. ఎన్నో లక్షల సొమ్ము ఖర్చు పెట్టి అన్ని పరీక్షలు చేయించుకున్నాను. నిరాశతో కృంగిపోయాము. ప్రార్థించినప్పుడు జవాబు లేదు. గనుక భర్తతో నిశ్చలమైన స్థిరమైన మనస్సుతో బిడ్డలు లేకపోయిన నాకు నీవు, నీకు నేను దైవ సేవలో ముందడుగు వేద్దాం అని నిర్ణయించుకున్నాము. హబక్కూకు 3:17-19, చివరి వచనం స్వతంత్రించుకున్నాము."అంజూరపు చెట్లు పూయకుండినను, ద్రాక్ష చెట్లు ఫలింపకపోయినను ఒలీవ చెట్లు కాపు లేక యుండినను చేనిలోని పైరు పంటకు రాకపోయినను గొర్రెలు దొడ్డిలో లేకపోయినను సాలలో పశువులు లేకపోయినను నేను యెహోవాయందు ఆనం దించుదును యెహోవా నాకు బలం. ఈ వాక్యమే మా నిరీక్షణా ధారము. మా యిద్దరి ఉద్యోగ బాధ్యతలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పిల్లల లేమి మర్చిపోయాము.

సాఫీగా సాగిపోయే నా జీవితంలో మరొక తీరనీ విషాదం నా తల్లి అనారోగ్యం. గుండె ఆపరేషన్ చేయించాము. సేవ సదనం గుర్తింపు కొరకు, ఆర్థిక సహాయం కొరకు అమ్మ తీవ్రంగా శ్రమించారు. శ్రమ ఫలించి మంచి అధ్యాపకులు, ప్రత్యేకంగా మానసిక వికలాంగులకై ట్రైనింగ్ పొందిన ఏడుగురు నిరాడంబర అధ్యాపకులతో దైవభక్తి ప్రాధాన్యతలో నేడు సేవాసదన్ దివ్యంగా సాగిపోతుంది. అమ్మ ఫిబ్రవరి 4వ తేది 2004 సంIIలో చనిపోయారు. అమ్మ వదిలిపెట్టిన బాధ్యతను నేను స్వీకరించాను. నా బాధ్యతనుబట్టి పిరికి దానిగా ఉన్నప్పుడు గిద్యోను జీవితం నాకు ఆదర్శమైనది. "పరాక్రమముగల బలాఢ్యుడా" అని పిరికివానిలో గొప్ప వ్యక్తిని చూచిన దేవునిపై ఆనుకొని నా బాధ్యతలను కొనసాగిస్తున్నాను.

ఆశ్చర్యం అద్భుతం 2004 సంIIము డిసెంబర్ 23 తేది నేను గర్భవతిగా ఉన్నట్లు తెలుసుకున్నాను. స్కానింగ్ ఫలితం కూడ స్థిరపరచింది. దేవునికి స్తుతి మహిమ చెల్లించాము. సైతాను నా విశ్వాసాన్ని చలింప చేయాలని 2వ నెలలో నాకు రక్తస్రావం జరిగింది. అయితే స్కానింగ్ తీయగా పసిబిడ్డ గుండె చప్పుడు గమనించి, ఆశ్చర్యంతో దేవుని ఘనపరచాను. 7వ నెలలో విపరీతమైన రక్తస్రావం అయ్యింది. మరల దేవుని వాగ్దానాలపై ఆనుకొని మొర్ర పెట్టాను. అస్పత్రికి తక్షణమే వెళ్ళగా అత్యవసర పరిస్థితు లలో సిజేరియన్ చేశారు. పసిబాబును యింక్యుబేటర్లు గమనించటానికి కొన్ని రోజులుంచారు. అనేక మంది భారంతో ప్రార్థనలు చేసారు. యెషయా 27:3, యెహోవా అను నేను దానిని కాపు చేయుచున్నాను. ప్రతి నిమిషము నేను నీరు కట్టుచున్నాను. ఎవడును దాని మీదకి రాకుండ దివారాత్రము దాని కాపాడుచున్నాను. దేవుని వాగ్దానాన్ని బట్టి బాబు క్రమేణ కోలుకున్నాడు. నేను 16 సంIIల వివాహం తర్వాత క్రీస్తు అద్భుత దీవెనను చూచి ప్రభువుని ఘనపరిచి ఆనందిస్తున్నాను. నమ్మదగిన దేవుడు నేను ఆశించిన దాని కంటే అధికంగా నా ప్రార్థనల నాలకించి నన్ను సంరక్షించి నడిపిస్తున్నారు. నా కుటుంబం కొరకు ప్రత్యేకంగా బాబు కొరకు ప్రార్థించాలని ఆశిస్తున్నాను.

# దేవుడు - సిరి

ఈ సృష్టిని సమస్తాన్ని దేవుడు మానవుని కొరకు చేశాడు. అతను ఈ సృష్టిని ఏలాలి? అందుకు అతనికి ఎటువంటి ఆయుధాలు అవసరం లేదు. పంటలు పండటానికి వర్షము కూడా అవసరం లేదు.

పండు తిని దేవునికి దూరమయేటంత వరకు ఎన్ని వేల వందల సంవత్సరాలు గతించాయో! ఎన్ని వేలకోట్ల జనులు జీవిస్తున్నారో అందరూ మరణించకుండానే ఉన్నారు.

మొదట్లో పక్షులవలె కొట్లు, గరిశెలు లేకుండానే జీవించారు. ఏ రోజుకు ఆ రోజు అనుదినాహారము పొందారు. ఇప్పుడు మరణం వచ్చింది. అప్పుడు దేవుడు ఆదాముతో "నీవు, నీ భార్య మాట విని తినవద్దని నేను నీ కాజ్ఞాపించిన వృక్షఫలములు తింటివి గనుక నీ నిమిత్తము నేల శపించబడియున్నది. ప్రయాసముతోనే నీ బ్రతుకు దినములన్నియు దాని పంట తిందువు" అన్నాడు.

దేవుడు అన్న మాట నెరవేరాలి. మన బ్రతుకు దినములన్నియు ప్రయాసకరమే. కాని చాలామంది ప్రయాస లేకుండా తినాలి. ఇతరులు ప్రయాసతో నేను కూర్చుని, పండుకొని తినాలి అనుకుంటారు. అలా అనుకున్నవారు రోగాలకు గురౌతారు. డబ్బు ద్వారా రోగాలు బాగు చేసుకోవాలి అనుకుంటారు కాబట్టి డబ్బు సంపాదించాలి. ముందు వందలలో, తర్వాత వేలలో, లక్షలలో, కోట్లలో మళ్ళీ వందలకోట్ల, వేలకోట్లు, లక్షల కోట్లు సంపాదించాలి. ఇవి సంపాదించటానికి చేసే పని ఒత్తిడే వారి అనారోగ్యానికి కారణం అవుతుంది.

జీవనమంటే యేసుతో జీవించేది. అది కావాలంటే నీ జీవనమంతా ఆయనకివ్వాలి. అది జీవితం. అది మరచి పోయి అలా బాధల జీవితాన్ని అనుభవిస్తూ ఉన్నాము.

ఇప్పుడు ఈ క్షణంలో ఏ విధమైన కారణము వలన నైనను, చివరికి యాక్సిడెంటు వలన అయినను హాస్పిటల్‌లో ఉన్నవారు, అలజడి జీవితంలో ఉన్నవారే. వారి జీవితాలకు వారే కర్తలనుకొని పూర్తిగా దేవుని కాపుదల విషయం మరచిపోయినవారే. సేవకులు కూడా సేవ విషయం మరచిపోయి సంస్థలు, పేరు ప్రతిష్ఠల కోసం పోటీపడి వారి తలలోని నరాలు చిట్లేంత ఆలోచనలలో ఉండి హాస్పిటల్ పాలవుతున్నారు. హాస్పిటల్ పాలవక పోయినా ఇంట్లో మాత్రలు మింగుతున్నారు.

యెరూషలేము దేవాలయ ప్రాంగణములో స్త్రీల విభాగం వద్ద కానుకల పెట్టె ఉన్నది. దాని ప్రక్కన పరదేశుల కొరకు, అన్యజనాంగముల కొరకైన స్థలము కేటాయించ బడినది. అక్కడ యేసుప్రభువు తన శిష్యులతో ఉన్నాడు. ధనవంతులైన వారు అక్కడ వరుసలో వస్తున్నారు. ఒక్కొక్కరు వచ్చి ఆ హుండీలో నాణాలు పోస్తున్నారు. జనం నాణాలను చూస్తున్నారు. ప్రభువు వారి యొక్క హృదయాన్ని మాత్రం చూస్తున్నాడు. చందావేసే ప్రతివాని ఆస్తిపాస్తులు ఎంతో ప్రభువుకు తెలుసు. వారి హృదయల్లో ఆ క్షణంలో ఉన్న ఆలోచనలు ప్రభువుకు తెలుసు.

ఇతరులకు మనం ఇచ్చేది వారిమీద జాలి వలన అవవచ్చు వారిమీద మనకున్న ప్రేమ అనవచ్చును, లేక వారికిస్తే, అందువలన మనకు వచ్చే లాభం ఆశించి ఇవ్వవచ్చును. మొదటిది, మూడవది ముందు ఆలోచించి, లెక్కలు వేసి ఇచ్చేది. ప్రేమతో ఇచ్చేది హృదయంలో నుండి వచ్చే భావనకు రూపం. ఇందులో స్వార్ధం ఏ మాత్రం ఉండదు. నాకు తెలిసిన చాలమంది దేవుని ప్రేమించే వారు దశమ భాగము ఎన్నడు ఇవ్వరు. పాతిక భాగమో, యాభై భాగమో సంతోషంగా దేవునికి ఇచ్చి, అయ్యో! నేనింకా ఇవ్వలేక పోయానే అని బాధపడతారు.

దేవునికి మనమిచ్చే దానికి ఆయన లెక్కకట్టి మరీ మనకు ఇస్తాడు. యేసుప్రభువు 'ఇహలోకంలో నూరంతలుగా' పొందుదురని అన్నాడు కదా!

చిన్నపిల్లల పేజి

# బైబిలు కథలు - ఏలీయా

పిల్లలూ!ఎలా ఉన్నారు? హోమ్ వర్క్‌తో బిజీగా ఉన్నా కొంత సమయాన్ని, ప్రార్థించుటకు, బైబిల్ చదువుటకు వెచ్చించడం మర్చిపోకండి. దేవుని జ్ఞానాన్ని తెలుసుకోండి. మరి ఈ రోజు కథలోకి వెళ్దామా.

దావీదు కుమారుడైన సొలొమోను దేవుని ఆజ్ఞలను పాటించక దేవుని దృష్టికి యోగ్యమైనది చేయకపోవడంతో దేవుడు సొలొమోను చేతిలోనుండి రాజ్యాన్ని కొట్టివేసి యరొబాముకి ఇచ్చాడు. యరొబాము ఎఫ్రాయిము గోత్రానికి చెందినవాడు. అతని తండ్రి పేరు నెబాతు, తల్లి పేరు జెరూహా. అయితే దేవుడు దావీదుతో చేసిన నిబంధనను బట్టి దావీదు సంతతి వారికి ఒక గోత్రాన్ని ఇస్తాను అని చెప్పాడు కాబట్టి అప్పటి నుండి ఇశ్రాయేలీయులలో యూదా గోత్రము వారిని దావీదు సంతతివారు పరిపాలించారు. యూదా గోత్రాన్ని పరిపాలించిన రాజుని యూదా రాజని, మిగిలిన గోత్రాలవారిని పరిపాలించిన వారిని ఇశ్రాయేలు రాజులు అన్నారు. యూదా దేశానికి యెరూషలేము, ఇశ్రాయేలీయుల దేశానికి షోమ్రోను ముఖ్య పట్టణాలు. ఈ విధంగా ఐగుప్తు నుండి వచ్చిన ఇశ్రాయేలీయులు రెండు దేశాల వారుగా విడిపోయారు. దేవుడు యరొబామును రాజుగా చేశాక యరొబాము ఇశ్రాయేలీయులు బలులు అర్పించుటకు యెరూషలేముకు వెళ్ళి తమ మనస్సు మార్చుకొని యూదా రాజుతో కలసి తన మీద తిరుగుబాటు చేస్తారేమో అనుకొని రెండు బంగారపు దూడలను చేయించి ఒకటి దానులో, ఒకటి బేతేలులో పెట్టించెను. ఇశ్రాయేలీయులు వాటిని పూజించి దేవునికి విరోధముగా పాపము చేయుటకు కారణమయ్యాడు. యరొబాము తరువాత నాదాబు, బయెషా, ఏలా, జిమ్రి, ఒమ్రి ఇలా చాలా మంది రాజులు పరిపాలించారు. ఒమ్రి తరువాత అతని కుమారుడైన అహాబు ఇశ్రాయేలీయులకు రాజుగా ఉన్నాడు. రాజైన అహాబు దేవున్ని పూర్తిగా మరచి, షోమ్రోనులో బయలుకు ఒక బలిపీఠము కట్టించి, దేవతాస్థంభం నిలిపి దేవుని దృష్టికి పాపము చేసెను. అహాబు భార్య పేరు యెజెబెలు. వీళ్ళిద్దరు దేవుని దృష్టికి వ్యతిరేకమైన జీవితం కలిగిన వారు. యెజెబెలు దేవుని ప్రవక్తలను చంపడమే కాక తన భర్తయైన అహాబును కూడ అలాగు చేయడానికి ప్రేరేపించింది.




ఆ కాలంలోనే గిలాదు పట్టణంలో ఏలీయా అనే ప్రవక్త ఉండేవాడు. ఒక రోజు ఏలీయా అహాబు రాజుతో కొంత కాలం వర్షమైనను మంచైననుపడదు అని చెప్తాడు. అయితే అహాబు ఏలీయాను చంపటానికి ప్రయత్నించగా దేవుడు ఏలీయాను కెరీతు వాగు దగ్గర దాగి ఉండు అక్కడ నీకు ఆహారము ఇవ్వడానికి కాకులకు ఆజ్ఞాపించాను, వాగు నీరు త్రాగుతు అక్కడ ఉండమని చెప్తాడు. ఏలీయా దేవుని మాట ప్రకారం కెరీతు వాగు దగ్గర నివసించెను. అక్కడ అతనికి ఉదయమున, సాయంకాలమున కాకులు రొట్టెను, మాంసమును తీసుకొనిరాగా ఆ ఆహారం తిని. కెరీతు వాగు నీళ్ళు త్రాగుతూ కొంతకాలం గడిపాడు. అయితే వర్షం లేకపోవడంతో వాగు ఎండిపోవడంతో దేవుడు ఏలీయాను

సారెపతు అనే ఊరిలోని ఒక విధవరాలి దగ్గరకు వెళ్ళమని చెప్పగా ఏలీయా సారెపతు ఊరి గవిని దగ్గరకు రాగా అక్కడ ఒక విధవరాలు కట్టెలు ఏరుకుంటూ కనబడింది. ఏలీయా ఆమెను త్రాగడానికి కొంచెం నీళ్ళు, తినుటకు ఒక రొట్టెముక్కను నీ చేతితో తీసుకొని రమ్మని చెప్తాడు. అందుకా విధవరాలు దేవునితోడు తొట్టెలో పట్టెడు పిండి, బుడ్డిలో కొంచెం నూనె తప్ప నా దగ్గర ఇంకేమి లేదు. చనిపోవడానికి ముందు నేను నా కొడుకు తినుటకు కట్టెలు ఏరుతున్నాను అని చెప్తుంది. అప్పుడు ఏలీయా ఆమెతో భయపడకు నీవు అనుకున్నట్లే నీకు నీ కొడుక్కి అప్పములు చేసుకో అయితే అందులో ముందుగా నాకొక చిన్న రొట్టె చేసి తీసుకొనిరా అని చెప్తాడు. ఆమె ఏలీయా మాట ప్రకారం చేయగా కరువుకాలం తీరేంతవరకు తొట్టెలో పిండి తక్కువ కాలేదు, బుడ్డిలో నూనె అయిపోలేదు. ఒకసారి ఆ విధవరాలి కుమారుడు చనిపోగ ఏలీయా ప్రార్థించగా దేవుడు ఆ బిడ్డను బ్రతికించెను. ఆ తరువాత దేవుడు వర్షం కురిపించ బోవుచున్నాను కాబట్టి నీవు వెళ్ళి అహాబు రాజును కలుసుకొమ్మని చెప్పగా ఏలీయా అహాబును కలుసుకొని బయలు ప్రవక్తలు 450మందిని, ఆషేరాదేవి ప్రవక్తలు 400మందిని కర్మెలు పర్వతము మీద సమకూర్చమని చెప్తాడు. అహాబు బయలు ప్రవక్తలను, ప్రజలను కర్మెలు కొండపై సమకూర్చగా ఏలీయా జనులతో “ఎంతకాలం మీరు దేవుని తెలుసుకోక ఉంటారు? ఈ రోజు నిజ దేవున్ని తెలుసుకోండి ఎవరైతే ఆకాశము నుండి అగ్నిని పంపి బలిపీఠముపై బలిని దహించునో అతనే నిజమైన దేవుడని తెలుసుకొని ఆ దేవున్ని ఆరాధించండి” అని చెప్తాడు. బయలు ప్రవక్తలు ఉదయం నుండి సాయంత్రం వరకు వాళ్ళ బయలును పూజిస్తూ, తమ శరీరాలను బాధ పరుచుకుంటూ ఉన్నప్పటికి ఎటువంటి ఫలితం లేక పోవడంతో ఏలీయా జనులను పిలిచి యెహోవా నామమున బలిపీఠము కట్టించి దానిచుట్టూ కందకము త్రవ్వించి బలిపీఠముపై కట్టెలను పేర్చి ఒక ఎద్దును వధించి ఆ కట్టెలపై ఉంచి, పశు మాంసమును, కట్టెలను, 4 తొట్ల నీళ్ళతో తడుపుమని చెప్పెను. జనులు అలా చేయగా బలిపీఠము చుట్టూ త్రవ్వబడిన కందకము కూడ నీళ్ళతో నిండగా, ఏలీయా యెహోవా దేవునికి ప్రార్థించగా ఆకాశమునుండి అగ్ని దిగి బలిని దహించెను. అది చూసిన జనులు యెహోవాయే దేవుడు అని కేకలు వేశారు. అప్పుడు ఏలీయా కీషోను వాగు దగ్గర బయలు ప్రవక్తలందరిని చంపెను. ఆ తరువాత షోమ్రోనులో వర్షం పడింది. ఏలీయా బయలు ప్రవక్తలను చంపిన విషయం తెలుసుకున్న యెజెబెలు ఏలీయాను చంపాలనుకుంది. ఏలీయా కూడ భయపడ్డాడు అయితే దేవుని ద్వారా ధైర్యపరచబడ్డాడు. ఏలీయా అందరిలా చనిపోక సుడిగాలిలో ఆకాశమునకు ఆరోహణమయ్యాడు.

ఏలీయా దేవుని కొరకు రోషము కలిగిన వ్యక్తి అందుకే దేవుని విషయంలో రాజును ఎదిరించాడు, బయలు ప్రవక్తలందరిని చంపాడు. అంతేకాదు యెజెబెలు యెహోవా ప్రవక్తలను చంపుతుంది అని తెలిసిన దేవుడు అహాబును కలుసుకోమని చెప్పినప్పుడు ఏ మాత్రం ఆలోచించక దేవుని మాట చొప్పున చేశాడు. అందుకే ఏలీయా చెప్పిన మాట ప్రకారం షోమ్రోనులో దాదాపు మూడున్నర సం॥లు వర్షం పడలేదు. కరువు కాలంలో కూడ దేవుని ద్వారా పోషించబడ్డాడు. అందరిలా అతను చనిపోక ఆకాశానికి ఆరోహణమయ్యాడు. మనం కూడ ఏలీయా వలె దేవుని పట్ల రోషము కలిగి జీవించాలి. దేవుని పట్ల రోషం కలిగి ఉండటం అంటే దేవునికి చెందవలసిన ఘనతను, మహిమను, మరి దేనికి ఇవ్వకుండా ఉండటం. విగ్రహారాధన చేయకుండా ఉండటం. విగ్రహారాధనకి, విగ్రహాలకు సంబంధించిన వాటికి దూరంగా ఉండటం. చాలా మంది పిల్లలు విగ్రహ ఉత్సవాల్లో పాల్గొంటుంటారు. దేవున్ని ఎరిగిన మనం అలా ఉండకూడదు. మన దేవుడు సజీవుడు కాబట్టి అటువంటి విగ్రహ సంబంధిత పనుల్లో మనం ఉండ కూడదు. దేవుడు చెప్పిన మాటలను హృదయ పూర్వకంగా అంగీకరించి అనుసరించాలి అప్పుడే మనం దేవున్ని మహిమ పరిచినవారమౌతాము.

**ఆధునిక దృక్పథం**

**క్రొత్త కోణాలు**

# 5. ధన్యతలు – లేమిలో కలిమి

## Beatitudes

**"ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు పరలోకరాజ్యము వారిది" మత్త. 5:3**

"Blessed *are* the poor in spirit for theirs is the kingdom of haven"_ KJV.

**"బీదలైన మీరు ధన్యులు, దేవుని రాజ్యము మీది" _ లూకా 6:20.**

**బీదలు ధన్యులని ఎవరో తెలిసీ తెలియక పేదరికాన్ననుభవించే ప్రతి ఒక్కరూ తమదే పరలోకరాజ్యమని కాస్త జరుగుబాటున్న వారు ఈ లోకంలో సౌఖ్యం, పరలోకంలో నరకం అనుభవిస్తారు (ధనవంతుడు - లాజరులవలె) అనుకొంటుంటారు. పరలోకరాజ్యమెవరిదో క్రొత్త కోణాల్లో ఆలోచించి చూద్దాం.**

### కొండమీది ప్రసంగం (The Sermon on the Mount)

(మత్త. 5:1, లూకా 6:17)

'కొండమీద ప్రసంగం' ఏ మత విచక్షణ లేకుండా ప్రపంచ వ్యాప్తంగా సభ్యసమాజం మానవ జీవనశైలికి దిక్సూచిగా ఒప్పుకుంటుంది. అయితే, యేసు దీనినొక నైతికశాస్త్ర టిప్పణిగా బోధించలేదు. ఇందలి ప్రతి అంశం తాను ఇహపరలోకాల్లో స్థాపింపదలచిన దేవుని రాజ్యం, లేక పరలోకరాజ్యానికి సంబంధించిన ఆత్మీయ నడవడిని సూచించే బోధ. ఈ ప్రసంగమంతా యేసు ఒకేరోజు, ఒకేస్థలంలో ఒక్క ఉదుటున చేసిన ప్రసంగం కాదని, మూడు అధ్యాయాల్లో (5,6,7,) మత్తయి నిరవధికంగా వ్రాసిన సంగతులు యేసు అప్పుడప్పుడు చేసిన బోధల సంపుటి అని అనుకొనటానికి ఆధారాలున్నాయి. లూకా సువార్తలో ఒకేచోట కాకుండా సువార్త అంతటిలో ఈ విషయాలు చిలకరింపబడి ఉండటం ఆ అభిప్రాయాన్ని బలపరుస్తుంది. మత్తయి, యేసును రాజుగా మనకు పరిచయం చేస్తున్నాడు. రాజుకు ఒకరాజ్యం, ఆ రాజ్యావిష్కరణ కొక ప్రణాళిక ఉంటాయి. యేసు రాజ్యం పరలోక రాజ్యం. ఆ రాజ్యాంగ ప్రణాళిక (manifesto) యే కొండమీది ప్రసంగం. లూకా కథనంలో యేసు తానేర్పరచు కొన్న పన్నెండుమంది శిష్యులతో దిగివచ్చి మైదానంలో వారితో సహా ఉన్న గొప్ప సమూహానికి ఈ ప్రసంగం చేసినట్లుంది. అందుకే ఈ ప్రసంగాన్ని 'క్రీస్తు సిద్దాంత సంగ్రహ'మని; 'క్రీస్తు సామ్రాజ్య హక్కుల పత్రమ'ని; శిష్యు లను పరిచర్యకు పంపకముందు వారేమేమి తెలుకోవాల్సింది తెలిపే 'అభిషేక ప్రసంగమ'ని పరిపరి విధాలుగా బిరుదు లిస్తుంటారు.

**వ్యాసరచనోద్దేశం:**

**పాత నిబంధనలో దేవుని వెంబడించిన వారికి దీవెనలు కోకొల్లలు. ఆకాళ వాకిళ్ళు విప్పి పట్టజాలనంత విస్తారంగా దీవెనలు క్రుమ్మరిస్తానన్నాడు. ఆనందకరమైన దేశంలో నివసింప చేస్తానన్నాడు. అన్యజనులు మిమ్మల్ని ధన్యులంటారన్నాడు (మలా. 3:10-12). నీ నామాన్ని గొప్ప చేస్తానన్నాడు (ఆది. 10:1-3). అయితే అందుకు ప్రతిగా మనల్ని తన జనంగా, తన ఆజ్ఞలననుసరించి నడవమన్నాడు. ఆ ఆజ్ఞల్ని పది ఆజ్ఞల రూపంలో ఇదివద్దు, అది కూడదని మోషే ద్వారా అందించాడు.**

**యేసు కూడ అదే ఆశీర్వాదాలను సూచించాడు. కాని, వాటిని క్రొత్తకోణాల్లో సాధారణంగా మానవ మాత్రులుగా మనం దీవెనలు కావనుకొనే వానిని ధన్యతలుగా పేర్కొన్నాడు (మత్త. 5:3-12, లూకా 6:17). ఇవి లౌకిక దీవెనలే గాక పారలౌకిక దీవెనలు. వీనిని క్రొత్తకోణాల్లో విప్పి చెప్పటం ఇందలి ప్రయత్నం.**

### ధన్యతలు (Beatitudes)

(మత్త. 5:3-12 లూకా 6:20-24)

కొండమీది ప్రసంగం క్రీస్తురాజ్య చట్టాంగం (Constitution) అయితే, అందలి తొలిమాటలయిన ధన్యతలు ఆ చట్టాంగానికి అవతారిక (Preamble) గా ఎంచవచ్చు. అనగా, చట్టాంగ రూపురేఖలన్నింటికి మూలాధార విషయాల సంక్షిప్త సంచయం అవి.

ధన్యతలను తెలుగులోగాని, ఇంగ్లీషులోగాని వ్రాసిన తీరు ఆదిమ గ్రీకు, హెబ్రీ వాక్య నిర్మాణానికి భిన్నంగా ఉందని గ్రహించాలి. KJV (ఆథరైజ్డ్ వెర్షన్)లో ('Blessed *are*....) అనేమాటలతో దాదాపు 9 వాక్యాలు ప్రారంభమౌతున్నాయి. ***'are'*** అనే క్రియతో, సంపూర్ణ వాక్యాలుగా వ్రాయబడ్డాయి. అయితే, ఈ వెర్షన్‌లో ఎక్కడైనా ఏటవాలు (italics) అక్షరాలు ఉంటే, ఆ మాటలకు సమమైన మాటలు ఆదిమ భాషా గ్రంథాల్లోలేవని అంటే ***'are'*** అనే క్రియాపదం గ్రీకులోగాని, హెబ్రీలోగాని లేదని. . యేసు మాటలాడింది సామాన్య ప్రజలు వాడే హెబ్రీ బాష. దాన్నే అరామి బాష అంటారు. ఆ బాషా సాంప్రదాయంలో, మచ్చుకు, 'ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు (అయివున్నారు)' అని క్రియాపదంలో పూర్తి అయ్యే వాక్యరూపంలో ఉండదు. అంటే, ధన్యతలు, భావార్థకాలు (Statements) కాదు. అవి ఆశ్చర్యార్థకాలు (Exclamations)! వాని రూపం: ఆత్మవిషయం దీనులగుట ఎంత ధన్యత! ఇలాంటి ప్రయోగాలు కీర్త. 1:1లో 'దుష్టుల ఆలోచన చొప్పున నడువకుంట ఎంత ధన్యత'! చూడగలం.

ఇలా అర్థం చేసుకొనటంలో ఒక మంచి ఉంది. ఈ రూపంలో కేవలం అని భక్తి ప్రమేయంతో ఆశాభావాలైన నిరీక్షణలు కాదు. లేక, మసక తెరల్లో ఛాయా చిత్రాల్లాగా మెదలాడే ప్రవచనాలు మాత్రమే కాదు. ఈ ధన్యతలు ఒక సత్ క్రైస్తవునికి ఏదో భవిష్యత్కాలంలో సంభవించే సూచికలు మాత్రమే కాదు. అవి యిప్పుడే, యిక్కడే అనుభోగ్యాలైన విజయాలు. అలాంటి వానిని సాధించగలిగి నందుకు సాధించిన వారికి చెప్పే శుభాకాంక్షలు (Congratulations).

ఒక విధంగా చూస్తే, ఈ ధన్యతల సంప్రాప్తి దేవుని నిరంతర సన్నిధిలో ఆయన సంపూర్ణ సహవాస సాంగత్యంలో అనుభవానంద సంగతులు. అయినా, ఇవి ఈ లోకంలో ఉన్నప్పుడే పొందగలిగే వర్తమాన అనుభవాలు కూడా. ఓహో! క్రైస్తవునిగా ఉండటం ఎంత ధన్యత! క్రీస్తును ప్రభువుగా,

రక్షకునిగా తెలుసుకొనటం ఎంత ధన్యత! కనుక, ఈ ఆశ్చర్యార్థక రూపంలో ధన్యతలను చెప్పటం క్రైస్తవ జీవనశైలిలో టుంగుటుయ్యాల లూగించే ఆత్మీయ మజా కలుగుతుంది.

## ధన్యత (blessedness)

ధన్యత అనేది తెలుగు బైబులులోనిదే కాని, beatitude అనేది ఇంగ్లీషు బైబుల్లోని పదంకాదు. అందులో కనుపించేది 'blessed' అనేమాట.

అలా అయితే ఈ ధన్యత అనేమాట మూలంలో ఏ అర్థం యిస్తుందో? ఈ మాట 'మాకరియోస్' (makarios) అనే గ్రీకు పదం నుండి వచ్చింది. అది దేవతల సంథర్భంలో ప్రస్తావించే మాట. కనుక, మానవ సంథర్భంలో ఎలా గ్రహించాలి? దానికొక ఆనవాలుంది. 'మాకరియోస్' అనే మాట కుప్ర (Cypres) ద్వీపాన్ని వర్ణించటానికి ఉపయోగించబడింది. ఈ ద్వీపం ఒక ఆనందమయ ద్వీపం. అందుకు కారణం అది సుందరమైనది, సిరిసంపదలకు నెలవయింది. అతి సారవంతమైన కారణంగాను, అనేక సహజ ఒనరులకు నిలయమైనది కనుకను అందు నివసించే వారు సంపూర్ణ సంతోష జీవితాన్ననుభవించ టానికి దాని తీరాలు విడిచి వెళ్లాల్సిన అవసరం లేదు. శీతోష్ణ స్థితి, పుష్ప, ఫలవృక్షాలతో సస్యశ్యామలమైనది. కావాల్సిన ఖనిజ సంపత్తి కావాల్సినంతగా ఉంది. కనుక, ధన్యత (మాకరియోస్) అనే మాటకు నిశ్చలమైన, నిర్మలమైన, స్వయంసమృద్ధమైన, జీవితంలోని ఒడుదుడుకులతో సంబంధం లేకుండ ఎడతెగని నిత్యానంద స్థితిని సూచించే మాటగా గ్రహించాలి! ఇది ఇంగ్లీషులో 'happy' అనేమాటకు సమానంకాదు. happy అనేమాట 'hap' (అంటే 'happening') మీద ఆధారపడినదని. అదృష్టం, దురదృష్టం ఏదైనా సంభవమే కనుక happy అనేది అదృష్ట దురదృష్ట సంభవాలమీద ఆధారపడి ఉంటుంది. 'ధన్యత' ఒక స్థిరస్థితిని సూచిస్తుంది.

## బీదలు-దీనులు

మొదటి ధన్యతను పరిశీలిస్తే - లూకా 6:20లో 'బీదలు' అనిన్నీ, మత్త. 5:3లో 'దీనుల'ని వాడబడ్డా మాటల్ని వేర్వేరు గ్రీకు పదాలు సూచిస్తాయి. Penes (పెనెస్) అంటే పేదవాడు. కాయకష్టంతో పొట్టపోసుకొనేవాడు. సంపాదించేది పొట్టకూటికేగాని మిగులుండని వారు. అట్లని బొత్తుగా దిక్కుమాలిన వాడని కాదు.

ఈ ధన్యతలో ఉపయోగించిన మాట 'ప్టోచోస్' (ptochos) అని. ఈ మాటకర్థం, నిష్టదరిద్రునికి ఉన్నదంటూ ఏమి లేదు, ఉండదు. అట్టడుగుకు క్రుంగి కూరుకపోయిన దీనుడు. ఈ మాట ప్రయోగం వల్ల ఈ ధన్యత బహు ఆశ్చర్యాన్ని కల్గిసుంది. ఇలాంటి దిక్కూమొక్కూలేని అంబేదకుడు ధన్యుడనటం ఎలా సాధ్యం? ఇది సాధారణ పేదరికం లేక లేమి కాదు.

## లేమిలో కలిమి

ఇది లేమిలో కలిమి. హెబ్రీబాషలో 'బీదవాడు' అంటే, అంచెలవారిగా కేవలం ఏవిధమైన పలుకుబడి, చేయూత, వత్తాసు, గౌరవప్రతిష్టలు లేని కటిక దారిద్ర్యంలో ఉండే బీదవాడు; అలాంటివి లేని కారణంగా అణగద్రొక్కబడి, పీడించబడి; చివరకు ఐహిక ఒనరులు రవ్వంతైనా లేని కారణంగా, తన భారం యావత్తు దేవుని మీద వేసేవాడనే అర్థరూపాతరం చెందిన మాట. 'ప్రయాసపడి భారము మోయు....' అనే కోవకు చెందిన వారని.

కనుక, హెబ్రీబాషలో 'ఆని', లేక 'ఎబియోన్' అనే మాటలు - భారమంతా దేవుని మీద మోపే నిస్సహాయ దీనుణ్ణి సూచిస్తుంది. బీదవాడంటే అచ్చంగా డబ్బులేని వాడనికాదుగాని దేవుని మీద ఆధారపడ్డ దీనుడని - 'ఈ దీనుడు మొట్టపెట్టగా యెహోవా ఆలకించెను, అతని శ్రమలన్నిటిలోనుండి అతని రక్షించెను' అని కీర్తనీడు కీర్త. 34:6లో గానం చేశాడు! అలానే, కీర్త. 35:10; 68:10; 72:4; 107:41; 132:15 లన్నింటిలో బీదవాడంటే తన భారమంతటిని యెహోవా మీద సంపూర్ణంగా మోపే నిస్సహాయ దీనుడని. అట్టివాడే ధన్యుడు_ కేవలం సోమరితనం, దురలవాట్లతో దేవునికి దూరమై, తప్పిపోయిన కుమారునిలా, నిష్టదరిద్రానికి, నికృష్ట జీవితానికి దిగజారిన 'బీదవాడు' కాదు. పశ్చాత్తాపముతో తిరిగి దేవుని అండ కోరినప్పటి స్థితిని ధన్యతగా గ్రహించవచ్చు! అందుకే, ఆత్మ విషయమై దీనులైన (poor in spirit) అనే మాటలు వాడబడ్డాయి.

అంటే, అసలు వస్తురూప (material) పేదరికం ఏ కోణాన్నుండి చూచినా అభిలషనీయం కాదు, ధన్యత కానేకానేరదు. సన్యసించి పేదరికం స్వీకరించటం కూడా నిజ క్రైస్తవ జీవనశైలికి ఆమడదూరం. మురికివాడల్లో కూడు, గుడ్డ, గూడులేకుండా, పందుల పొట్టు తినే అధఃమానవ (Sub-human) స్థితికి దిగజార్చే పేదరికం ధన్యత అని చెప్పటం లేదు. ఆ మాటకొస్తే అలాంటి పేదరికం నుండి తోడి మానవుల్ని సాటి సోదరప్రేమతో (నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమించు) ఉత్పతనం చేయమని క్రీస్తు సువార్త పిలుపునిస్తుంది. ఆ పిలుపు వస్తురూప సహాయానికి కాదు. అన్నింటికన్న ఆత్మీయ మారుమనస్సును సాధించే పిలుపు. కమ్యూనిష్టు, సోషలిష్టుల పిలుపు వస్తురూప పేదరిక నిర్మూలనకు. క్రొత్తకోణాల్లో, క్రీస్తు యిచ్చేది ఆత్మీయ పేదరిక నిర్మూలనకు!

## పరలోకరాజ్య ప్రాప్తి

అట్టివారిది పరలోకరాజ్యం. ప్రభువు నేర్పిన ప్రార్థనలో 'నీ రాజ్యం వచ్చుగాక! నీ చిత్తం పరలోకమందేలాగో ఆలాగే భూమియందు నెరవేరును గాక!' అని పలవరిస్తాము కదా! దేవుని రాజ్యమంటే దేవుని చిత్తం నెఱవేరే రాజ్యం. ఆయన చిత్తమంటే ఆయన ఆజ్ఞలు, రక్షణమార్గం శిరోధారం చేసుకొనటమని. అప్పుడే, ఆయన మన భారాన్ని ఆయన మీద మోపుకొనేది. ఆ స్థితిలోనే మనం ధన్యులమయ్యేది. అదే లేమిలో మన కలిమి.

(విలియం బార్క్లే విశ్లేషణ ఆధారంగా)

| |
|---|
| వచ్చే మాసం:<br>విరిగిన హృదయం - దొరికే ఆదరణ |

## చందాదారుల వివరాలు

| | | |
|---|---|---|
| శ్రీమతి కె. సుభద్ర, విజయవాడ | రూ. | 2,000 |
| శ్రీ కెల్లి ఐజక్ సుకుమార్, ఒంగోలు, ప్రకాశం జిల్లా | రూ. | 2,000 |
| శ్రీమతి పి. అనిత, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా | రూ. | 1,200 |
| కుమారి జయదేవి, గుంటూరు | రూ. | 1,000 |
| శ్రీమతి ఆర్. జయమ్మలాబాను, గుంతకల్ | రూ. | 1,000 |
| శ్రీమతి సి.హెచ్.సుభాషిణి, గుడివాడ, కృష్ణాజిల్లా | రూ. | 1000 |
| శ్రీ కె. ఐజక్ ఒంగోలు, ప్రకాశం జిల్లా | రూ. | 1000 |
| పేరు తెలీదు (21-2-18 తేది) బ్యాంక్ అకౌంట్ | రూ. | 1000 |
| శ్రీమతి రాజ్యలక్ష్మి, భోపాల్ | రూ. | 1000 |
| శ్రీమతి రత్నకుమారి, కరీంనగర్ | రూ. | 500 |
| శ్రీ పరుసు వెంకటరావు, బెంగుళూరు | రూ. | 500 |
| శ్రీ పి. యేసుబాబు లోకేష్, ఎర్రంపల్లి, ప.గో.జిల్లా | రూ. | 500 |
| శ్రీ పి. దేవదానం, నగరంపాలెం, గుంటూరు | రూ. | 500 |
| కుమారి లీనా, బెంగుళూరు | రూ. | 500 |
| శ్రీ వి. యోహాను, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా | రూ. | 500 |
| శ్రీమతి కె.లూధియ, గోగులమూడి, గుంటూరుజిల్లా | రూ. | 500 |
| శ్రీ యం. నిర్మల్‌కుమార్, అనంతపురం | రూ. | 500 |
| శ్రీ ఎ. శ్రీనివాసరెడ్డి, హైదరాబాద్ | రూ. | 500 |
| కుమారి యం. విక్టోరియారాణి, యర్రగొండపాలెం | రూ. | 500 |
| శ్రీ ఏ. పరిశుద్ధ రాజు, నరసాపురం | రూ. | 500 |
| పాస్టర్.టి.రమేష్ అబ్రాహాము, పెన్నాడ, ప.గోజిల్లా | రూ. | 500 |
| శ్రీ పి. ఇమ్మానియేలు, విజయవాడ | రూ. | 500 |
| శ్రీమతి గ్రేస్ మంజుల, బెంగళూర్ | రూ. | 500 |
| పేరు తెలీదు (తేది12-10-17) బ్యాంక్ అకౌంట్ | రూ. | 400 |
| పాస్టర్ పి. సత్యానందం, మౌలాలి, హైదరాబాద్ | రూ. | 300 |
| పాస్టర్ జి. నల్లయ్య, కందుకూరు, ప్రకాశంజిల్లా | రూ. | 300 |
| శ్రీ కె. సురేష్, ఉప్పరపల్లె, కడప జిల్లా | రూ. | 300 |
| శ్రీ టి. నాగరాజు, చీమకుర్తి, ప్రకాశంజిల్లా | రూ. | 300 |
| శ్రీ ఐ. అనిల్‌కుమార్, కాకినాడ, తూ.గో.జిల్లా | రూ. | 300 |
| శ్రీమతి వి.శారాభాయి, భీమవరం | రూ. | 300 |
| శ్రీమతి యం. పుల్లమ్మ, కడప | రూ. | 300 |
| శ్రీ బాలాజీరావు సింథియా, వైజాగ్ | రూ. | 300 |
| కుమారి షెఫేలా, దొనకొండ, ప్రకాశం జిల్లా | రూ. | 300 |
| శ్రీ కె. ఉజ్జీవరాజు, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా | రూ. | 250 |
| శ్రీ ఆర్. ఇన్నయ్య, గుంతకల్లు | రూ. | 200 |
| శ్రీ టి. చిన్నా, మల్కీపురం, తూ.గో.జిల్లా | రూ. | 200 |
| శ్రీమతి బి. ప్రేమలత, కడప | రూ. | 200 |
| శ్రీమతి కె. వాణికుమారి, చీరాల, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీ డి. సుమన్, రుద్రాంగి, కరీంనగర్‌జిల్లా | రూ. | 200 |
| పాస్టర్ పి. కొర్నేలి, మామిళ్ళపల్లి, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి జి. లీలారాణి, ఒంగోలు, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీ బి. నాగభూషణం, వెంకటగిరి, నెల్లూరుజిల్లా | రూ. | 200 |
| శ్రీ పి. దేవదానం, పెదదోర్నాల, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| కుమారి కె. లక్ష్మిప్రియ, ఒంగోలు | రూ. | 200 |
| శ్రీ కె. దుర్గాప్రసాద్, రాజమండ్రి | రూ. | 200 |
| శ్రీ పి. గిద్యోను, నేరేడ్‌మెట్, హైదరాబాద్ | రూ. | 200 |
| శ్రీ వై. జోసఫ్, భీమవరం, ప.గో.జిల్లా | రూ. | 200 |
| శ్రీమతి టి.నిర్మలశాంసన్, వెలిగండ్ల, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి కె. ప్రేమారూత్, గుంటూరు | రూ. | 200 |
| శ్రీ కె. జెకర్యా, నర్సీపట్నం, విశాఖపట్నజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి యం. అరుణకుమారి, విశాఖపట్నం | రూ. | 200 |
| శ్రీ కె. యెషయా, ఆర్.జి.పురం, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి టి. సుమలత, ఆర్.జి.పురం, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి ఎన్. సరోజిని, నెల్లూరు | రూ. | 200 |
| శ్రీమతి జి. రోజమ్మ, చీరాల, ప్రకాశం జిల్లా | రూ. | 200 |
| శ్రీమతి సి.హెచ్. పుష్పారాణి, కాకినాడ | రూ. | 200 |
| శ్రీ కె. లాజరస్, కొయ్యలగూడెం, ప.గో.జిల్లా | రూ. | 200 |
| శ్రీ యం.శ్రీకర్‌కుమార్, జజ్జూరు, కృష్ణాజిల్లా | రూ. | 200 |
| శ్రీ ఆర్. శ్రీనివాస్, రావులపాలె, తూ.గో.జిల్లా | రూ. | 200 |
| శ్రీ పి. దేవదానం, నగరంపాలెం, గుంటూరు | రూ. | 200 |
| శ్రీ యం. ఐజక్, దాసన్నపేట, విజయనగరం | రూ. | 200 |
| శ్రీమతి కె. హేమాబాబ్జి, భీమవరం | రూ. | 200 |
| శ్రీమతి జె.డి. సుహాసిని ,రాజమండ్రి,తూ.గో జిల్లా | రూ. | 200 |
| శ్రీ సి.హెచ్.రామక్రిష్ణ, ఏలూరు, ప.గో జిల్లా | రూ. | 200 |
| శ్రీ కె.రవికుమార్, హైదరాబాదు | రూ. | 200 |
| శ్రీ కె.వి.వి.రమణ, గండేపల్లి, తూ.గో జిల్లా | రూ. | 200 |
| శ్రీ యం. అబ్రాహాము, తాడేపల్లి, గుంటూరు | రూ. | 200 |
| పేరు తెలీదు (తేది.7-4-18), బ్యాంకు అకౌంట్ | రూ. | 200 |
| పేరు తెలీదు (తేది.15-4-18), బ్యాంకు అకౌంట్ | రూ. | 200 |
| శ్రీ టి. మరియబాబు, గొట్టిపాడు, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి బి. కళ్యాణి, బెంగుళూరు | రూ. | 200 |
| పాస్టర్ బి. నెహెమ్యా, చిన్నగంజాం, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| యు. మేరి సలోమి, సిరివెళ్ళ, కర్నూలు జిల్లా | రూ. | 200 |
| శ్రీ కె. సందీప్‌తేజ, సూళ్ళూరుపేట, నెల్లూరుజిల్లా | రూ. | 200 |
| శ్రీ పి. జగదీష్, మధిర, ఖమ్మం జిల్లా | రూ. | 200 |
| శ్రీ యల్. నాగరాజు, నంధ్యాల, కర్నూలు జిల్లా | రూ. | 200 |
| శ్రీ యస్. గోపి, పార్వతిపురం,విజయనగరం జిల్లా | రూ. | 200 |
| శ్రీ యస్. విద్యాసాగర్, ఆత్మకూరు,కర్నూలు జిల్లా | రూ. | 200 |
| శ్రీమతి కె. లలిత భాగ్యం, కనిగిరి, ప్రకాశం జిల్లా | రూ. | 200 |
| పేరు తెలీదు (7-2-19 తేది) బ్యాంక్ అకౌంట్ | రూ. | 200 |
| శ్రీ ఐ. రాజ్‌కుమార్, గుంటూరు | రూ. | 200 |

| | | |
|---|---|---|
| శ్రీమతి.టి. సూర్యకుమారి, మహబూబ్ నగర్ | రూ. | 200 |
| శ్రీ కొట్టె కమల్, శ్రీరాంపురం, ఆదిలాబాద్ | రూ. | 150 |
| పాస్టర్ జె. జయరాములు, కాకినాడ | రూ. | 150 |
| పాస్టర్ ప్రకాశం, నారాయణపురం, వరంగల్‌జిల్లా | రూ. | 150 |
| శ్రీ కె.జె. జ్యోతిరాజ్, మార్కాపురం | రూ. | 150 |
| శ్రీ పి. ఆనంద్‌సాగర్, కాకినాడ | రూ. | 150 |
| పాస్టర్ వి.ఎ.యన్.ప్రసాద్, జడ్చర్ల | రూ. | 150 |
| పాస్టర్ టి. విజయపాల్, నరసరావుపేట | రూ. | 150 |
| శ్రీమతి బి. ఎస్తేర్‌రాణి, గోగులమూడి, గుంటూరు జిల్లా | రూ. | 150 |
| పాస్టర్ టి. ఆదాము, శంకవరప్పాడు, ప్రకాశంజిల్లా | రూ. | 150 |
| పాస్టర్ ఎ మత్తయ్య, వినుకొండ, గుంటూరు జిల్లా | రూ. | 150 |
| శ్రీ పి. చిన్నారావు, విజయవాడ, కృష్ణాజిల్లా | రూ. | 150 |
| శ్రీమతి పి. విజయలక్ష్మి, ఎర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా | రూ. | 150 |
| శ్రీ టి. సునీల్‌కుమార్, కోవెరపాలెం, నెల్లూరుజిల్లా | రూ. | 150 |
| శ్రీమతి వై. కెజియాసత్యసారథి, హైదరాబాద్ | రూ. | 150 |
| వి. మేరినిర్మల, మెట్రోపాలిటన్ మిషన్, విజయవాడ | రూ. | 150 |
| శ్రీ టి. మధుసూధన్, గుంటూరు | రూ. | 150 |
| పాస్టర్ బి. జెకర్యా, రావిపాడు, ప్రకాశం జిల్లా | రూ. | 100 |

**జూన్ నెలలో చందా కట్టిన వారు**

| | | |
|---|---|---|
| శ్రీ కె. సందీప్‌తేజ, సూళ్ళూరుపేట, నెల్లూరుజిల్లా | రూ. | 150 |

**మనియార్డరు ద్వారా, నెట్ బ్యాంకింగ్ ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేసిన వారు తప్పని సరిగా మాకు ఫోన్ చేసి తెలియజేయాలి. లేనిచో వారి పేరు చందాదారుల లిస్టులో ఉండదు. చందాకట్టిన వారిలో ఎవరి పేరైనా లేనిచో దయచేసి 9440217726 నంబరుకి ఫోన్ చేయమని కోరుచున్నాము**

**బైబిల్ క్విజ్ - 48 ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :**

1) **శ్రీమతి ఆర్.జయమ్మలాబాను,** గుంతకల్లు
2) **శ్రీమతి వై. కెజియా సత్యసారధి,** హైదరాబాద్
3) **శ్రీమతి జె.డి.సుహాసిని,** రాజమండ్రి
4) **శ్రీమతి కె. సుభద్ర,** విజయవాడ
5) **కుమారి. లక్ష్మీప్రియ,** ఒంగోలు, ప్రకాశం జిల్లా
6) **కె. లలితాభాగ్యం,** కనిగిరి, ప్రకాశం జిల్లా


## ప్రకటన

**క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.**

# ఈ నెల ప్రశ్న -జులై-2019

**దేవాగ్నిగుండము ఎన్ని మూరల కొలత గలది?**

(యెహెజ్కేలు) (రెఫరెన్సు తప్పని సరిగా ఉండాలి)




మీ జవాబు ఈ నెల 20వ తేదీ లోపు మీ పేరు, పత్రిక సీరియల్ నంబరుతో 9440217726 నంబరుకి **SMS** ద్వారా పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో 'లక్కిడిప్' ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ. 125/-లు విలువ చేసే **'ఆంధ్రక్రైస్తవ ఉజ్జీవ కీర్తనలు'** అనే 1000 పాటలు ఉన్న పుస్తకము బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు మాత్రమే ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 20వ తేది లోపు చందా చెల్లించే వారు కూడా పాల్గొనవచ్చును.

**జూన్ నెల ప్రశ్నకు జవాబు పంపించిన వారు**

జవాబు : యాజకుల (విలాప. 4:16)

1) శ్రీమతి.ఆర్. జయమ్మలాబాను, గుంతకల్లు
2) కుమారి.కె. లక్ష్మీప్రియ, ఒంగోలు ప్రకాశం జిల్లా
3) శ్రీమతి వై.కెజియా సత్యసారధి, హైదరాబాద్
4) కె. లలితాభాగ్యం, కనిగిరి, ప్రకాశం జిల్లా
5) కుమారి నారాయణమ్మ, మంగమూరు, ప్రకాశంజిల్లా
6) శ్రీమతి జె.డి.సుహాసిని, రాజమండ్రి

# బైబిల్ క్విజ్ - 48 జవాబులు

**1.**మెరీబా (యెహెజ్కేలు 48:28) **2.**బెల్తెషాజరు (దానియేలు 1:7) **3.**అర్యోకు (2:24) **4.**3:28 **5.**4:35 **6.** 62 సం॥లు (5:31) **7.**ఏ హానియు (6:23) **8.** లయము (7:14) **9.** హెచ్చించుకొనును (8:25) **10.**70 (9:24) **11.**3 (10:1) **12.**ఉత్తరదేశపు (11:6) **13.**1335 (12:12) **14.**జాలి నొందనిది (హోషేయ 1:6) **15.**నిరీక్షణ ద్వారముగా (2:15) **16.**ద్రాక్షపండ్ల అడలను(3:1) **17.**జ్ఞానము(4:6) **18.**యారేబు (5:13) **19.** గిలాదు (6:8) **20.** 7:16



# అక్షరయజ్ఞం

## బైబిల్ క్విజ్ - 49

(హోషేయ 8 నుండి 14వరకు, యోవేలు. ఆమోసు, ఓబద్యా)



శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. ఎవరు తినివేయబడుదురు? (హోషేయ 8అ)
2. ఎవరి కీర్తి పక్షి వలె ఎగిరిపోవును? (9అ)
3. --- ను వెదుకుటకు ఇదే సమయము. పూరించండి (10అ)
4. ఎవరు నిరాటంకముగా దేవునిమీద తిరుగుబాటు చేయుదురు? (11అ)
5. యాకోబు తప్పించుకొని ఏ దేశములోనికి పోయెను? (12అ)
6. " ఓ మరణమా, నీ ముల్లెక్కడ"? రిఫెరెన్స్ ఏమిటి? (13అ)
7. ఎవరి మార్గములు చక్కనివి? (14అ)
8. యోవేలు ఎవరి కుమారుడు? (యోవేలు 1అ)
9. శేషించినవారిలో ఎవరు కనబడుదురు? (2అ)
10. యెహోవా ఎక్కడ నివాసిగా వసించును? (3అ)
11. సిరియనులు చెరపట్టబడి ఏ దేశమునకు కొనిపోబడుదురు? (ఆమోసు 1అ)
12. ఎవరు తమ పితరులు అనుసరించిన అబద్ధములను చేపట్టి మోసపోయిరి? (2అ)
13. "సమ్మతింపకుండ ఇద్దరు కూడి నడుతురా?" రిఫెరెన్స్ ఏమిటి? (3అ)
14. దేవుడు ఏ పట్టణములను బోర్లదోసి నాశనము చేసెను? (4అ)
15. నీళ్ళు పారినట్లుగా --- జరగనియ్యుడి.పూరించండి (5అ)
16. ఎవరి వలె వాయించు వాయిద్యములు చేసుకుందురు? (6అ)
17. బేతేలులోని యాజకుడు ఎవరు? (7అ)
18. "వారి క్రియలను నేనెన్నడునుమరువను" రిఫెరెన్స్ ఏమిటి? (8అ)
19. --- సంతతివారిని సర్వనాశనము చేయక విడిచిపెట్టుదును. పూరించుము (9అ)
20. బెన్యామీయులు ఏ దేశమును స్వతంత్రించుకుందురు? (ఓబద్యా 1అ)

**గమనిక :-** మీ జవాబులను **SMS/Whatsapp**ద్వారా కూడా పంపవచ్చును. **SMS/Whatsapp** ద్వారా పంపేవారు మీ పేరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరుతో **"బైబిల్ క్విజ్-49"** అని టైపు చేసి, ప్రశ్న నంబరు, జవాబు, బైబిల్ రెఫెరెన్సుతో జవాబులన్నీ ఒకే మేసేజ్‌లో 9440217726 నంబరుకు పంపాలి. పోస్టుకార్డు లేదా ఎన్వలప్ కవరు ద్వారా జవాబులు (తెల్లపేపరు మీద, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరు, మీ ఫోన్ నంబరు వ్రాసి) పంపదలచిన వారు ఈ నెల 20వ తేదీలోపు **పరిశుద్ధత-బైబిల్ క్విజ్, పోస్ట్‌బాక్స్ నెం.28, ఒంగోలు-523001** అడ్రసుకు పంపగలరు.

**అన్ని ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాసిన వారిలో ఒకరికి "నా దూత" (బాప్తిస్మమిచ్చు యోహాను కథ) అను పుస్తకము (వెల రూ. 50/-) లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి ఉచితంగా పంపబడును**

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం.